రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	శుక్రవారం	శనివారం
కర్నూలు	6:34	4:59
నంద్యాల	6:31	5:59



రామయ్యా.. దిగిపోవయ్యా..!

- కర్నూలు మేయర్ పీఠం కోసం కూటమి వ్యూహం
- బీవై రామయ్య మీద అవినీతి అస్త్రాలు సంధిస్తున్న టీడీపీ
- ఎంపీ, ఎమ్మెల్యేలు సహా 24కు చేరిన టీడీపీ సంఖ్యాబలం
- కూటమి నేతలకు టచ్‌లో మరో ఆరుగురు వైసీపీ కార్పొరేటర్లు
- మేయర్ పదవీ కాలం నాలుగేళ్లు పూర్తి.. అవిశ్వాసం పెట్టేందుకు సన్నాహాలు

కర్నూలు న్యూసిటీ/కర్నూలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆరుగురు వైసీపీ కార్పొరేటర్లు అధికార కూటమి నాయకుల టచ్‌లో ఉన్నారు. వారు టీడీపీలో చేరితే సంఖ్యాబలం దృష్ట్యా మేయర్ పీఠం కూటమి సొంతం అవుతుంది. మేయర్ బీవై రామయ్య పదవీ కాలం నాలుగేళ్లు పూర్తయ్యింది. ఆయనను పదవి నుంచి దింపేందుకు రాజకీయ ఎత్తులకు పదును పెట్టినట్లు తెలుస్తున్నది. మేయర్ పీఠం కోసం టీడీపీ నాయకులు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. గత నెలలో టీడీపీ నేతలతో టచ్‌లో ఉన్న వైసీపీ కార్పొరేటర్లు రహస్యంగా సమావేశమై అవిశ్వాసం పెడితే మద్దతు ఇస్తా మని సంకేతాలు పంపించారు. సాంకేతిక కారణాల వల్ల టీడీపీ నాయకులు ఆ దిశగా దృష్టిసారించలేక పోయారు. తాజాగా ఆ అడ్డంకులు తొలగిపోవడంతో ఎప్పుడైనా కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వవచ్చనే చర్చ ప్రధానంగా జరుగుతోంది. అదే క్రమంలో మేయర్ రామయ్య అవినీతి అక్రమాలపై టీడీపీ కార్పొరేటర్లు ఏకరువు పెట్టారు. అవిశ్వాసం ద్వారా మేయర్ రామయ్యను దింపేస్తారా..? ఆయనే స్వచ్ఛందంగా రాజీనామా చేస్తారా..? అనే చర్చ జోరుగా సాగుతోంది.

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 52 డివిజన్ల (వార్డులు)లో కర్నూలు నియోజకవర్గంలో 33, పాణ్యం నియోజకవర్గం పరిధిలో 16, కోడుమూరు నియోజకవర్గం పరిధిలో మూడు డివిజన్లు వస్తాయి. 2021 మార్చిలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ 43 వార్డుల్లో విజయం సాధిస్తే.. టీడీపీ అభ్యర్థులు ఆరుగురు, ఆ పార్టీ మద్దతుతో విజయం సాధించిన ముగ్గురు స్వతంత్రులతో కలిపి టీడీపీ బలం 9 మంది కార్పొరేటర్లే. 19వ డివిజన్ విజయం సాధించిన వైసీపీ కార్పొరేటరు బీవై రామయ్య అదే ఏడాది మార్చి 19న మేయర్‌గా, డిప్యూటీ మేయర్లుగా ఎస్. రేణుక, ఎన్. అరుణ బాధ్యతలు స్వీకరించారు. రామయ్య మేయర్‌గా ఎంపికైనా తమకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదని పలువురు వైసీపీ కార్పొ రేటర్లు అసంతృప్తితో రగిలిపోతున్నా.. వైసీపీ అధికారంలో ఉండడంతో బయట పడలేదు. 2024 జూన్ 12న టీడీపీ సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికలకు ముందు.. ఆ తరువాత ఒక్కొక్కరుగా వైసీపీని వీడి టీడీపీ గూటికి చేరుతూ వచ్చారు.

బలం పుంజుకున్న కూటమి

కర్నూలు నగరపాలక సంస్థలో టీడీపీ కూటమి సంఖ్యాబలం పెంచుకుంటూ వస్తోంది. 52 మంది కార్పొరేటర్లు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎమ్మెల్యే మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఎక్స్ అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకున్నారు. వీరితో కలిపితే ఓటు హక్కు కలిగిన సభ్యుల సంఖ్య 56కు చేరింది. వీరిలో ఒకరు ఓ కేసులో న్యాయస్థానం శిక్ష ఖరారు చేయడంతో జిల్లా జైలులో ఉన్నారు. ఆయన ఓటు హక్కు కోల్పోతే.. 55 మంది ఉంటారు. అవిశ్వాస తీర్మానం ద్వారా మేయర్‌ను పదవి నుంచి దింపాలంటే 28 మంది సభ్యుల బలం ఉండాలి. టీడీపీ కార్పొరేటర్లు 9 మంది ఉంటే.. మరో 11 మంది వైసీపీ కార్పొరేటర్లు ఇప్పటికే అధికారికంగా టీడీపీలో చేరారు. ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యేలు నాలుగురు ఎక్స్ అఫిషియో సభ్యులు కలిపితే టీడీపీ సభ్యుల సంఖ్యా బలం 24కు చేరుతుంది. మేయర్ పీఠం దక్కించుకోవాలంటే నలుగురు సభ్యుల మద్దతు అవసరం అవుతుంది. అయితే.. ఇప్పటికే ఆరుగురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ నాయకులకు టచ్‌లో ఉన్నట్లు తెలుస్తున్నది. వాళ్లు టీడీపీలో చేరినా, అవిశ్వాస తీర్మానం రోజున మద్దతు ఇచ్చినా రామయ్యకు పదవీ గండం తప్పదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

పీఠం చేజారకుండా వైసీపీ వ్యూహం

మేయర్ పీఠం కోసం ఓ వైపు కూటమి నాయకులు వ్యూహాత్మక పావులు కదుపుతోంటే.. ఎలాగైనా పీఠం చేజారకుండా చూడాలని వైసీపీ ముఖ్య నాయకులు పావులు కదుపుతున్నారు. టీడీపీ నాయకులతో టచ్‌లో ఉన్నారనుకుంటున్న వైసీపీ కార్పొరేటర్లను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి బుజ్జగింపు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. అయితే.. వైసీపీలో మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్ మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. ఇటీవల నిర్వహించిన యువత పోరు నిరసన కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఫొటో లేకపోవడాన్ని ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. వైసీపీలో అంతర్గత విభేదాలు మేయర్ అవిశ్వాస తీర్మానంలో టీడీపీకి కలిసొచ్చే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

వ్యూహంలో భాగమేనా..?

మేయర్ బీవై రామయ్య నాలుగేళ్ల పదవీ కాలంలో పలు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారంటూ టీడీపీ కార్పొరేటర్లు గురువారం విరుచుకుపడ్డారు. అధికారం అడ్డం పెట్టుకొని ఏ పనికి ఎంత డబ్బు వసూలు చేసిందీ ఆధారాలతో సహా వెల్లడించారు. బినామి పేర్లతో ప్రభుత్వ భూములు కబ్జా చేశారంటూ ఆరోపించారు. రామయ్యను పదవి నుంచి దించే వ్యూహంలో భాగంగానే టీడీపీ కార్పొరేటర్లు ఈ అవినీతి అస్త్రాలను ఆయనపై సంధించారని పలువురు చర్చించుకుంటున్నారు.

సాంకేతికతతో నేర నియంత్రణ

- నేరగాళ్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్


నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలను నియంత్రించి, నేరగాళ్లను పట్టుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఎస్పీ విక్రాంత్ పాటిల్ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో వర్చువల్ విధానంలో పాల్గొన్న సీఐడీ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్‌తో ఎస్పీ మాట్లాడారు. అనంతరం ఎస్పీ జిల్లా పోలీసు అధికారులతో కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లలో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల పెండింగ్‌కు గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం పలు సూచనలు సలహాలు చేసి మాట్లాడుతూ కేసు నమోదు నుంచి అభియోగ పత్రాలు దాఖలు వరకు ప్రతి అంశాన్ని సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌లో నమోదు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌లలో నమోదయ్యే కేసుల వివరాలను ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌కు సీడీ ఫైళ్లను ఆయా పోలీసు అధికారులు సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేశారో లేదా అని ఆరా తీశారు. ఈ సమీక్షలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్, డీఎస్పీలు బాబు ప్రసాద్, శ్రీనివాసాచారి, ఉపేంద్రబాబు, హేమలత, భాస్కర్‌రావు, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అ.. అంటే అడవి

- అమ్మలాంటి అడవే ప్రాణికోటికి జీవనాధారం
- భూమిపై 31శాతం మాత్రమే అటవీ విస్తీర్ణం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేవలం 19 శాతమే
- నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం

6

రమణీయం.. గోరంట్ల మాధవుడి రథోత్సవం



రేపు డిప్యూటీ సీఎం పవన్ రాక

పర్యటనకు ఏర్పాట్లు చేయండి: కలెక్టర్ రంజిత్ బాషా


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఓర్వకల్లు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22వ తేదీన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జిల్లాకు రానున్నారని, ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఓర్వకల్లు మండలం పూడిచర్ల గ్రామ పరిధిలో రైతు సూర రాజన్న పొలంలో ఫారం పాండ్‌కు భూమి పూజ చేసి అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి గురువారం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి కలెక్టర్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లు, భద్రత గురించి ఎస్పీతో చర్చించారు. సుమారు సభకు 4వేల మంది వరకు హాజరు కానున్నారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్టేజీ, బారికేడ్లు తదితర ఏర్పాట్ల గురించి ఆర్‌అండ్‌బీ ఎస్ఈకి పలు సూచనలు చేశారు. వేదికపై ఏర్పాట్లను చూసుకోవాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. పారిశుధ్యం పనులు, శిలాఫలకం ఏర్పాట్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా, సౌండ్ సిస్టమ్, ఎల్ఈడీలు తదితర ఏర్పాట్లు చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రొటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయాలని, శుక్రవారం సాయంత్రానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టును సందర్శించి తీసుకోవాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఎస్ఈ పీఆర్ రామచంద్రరెడ్డి, ఎస్ఈ ఆర్‌అండ్‌బీ మహేశ్వరరెడ్డి, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్ నాగేశ్వరరావు, ఎస్ఈ ట్రాన్స్‌కో ఉమాపతి, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ శాంతకుమారి, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, ఆర్‌డీవో సందీప్ కుమార్, డ్వామా పీడీ వెంకటరమణయ్య, మెప్మా పీడీ నాగశివలీల తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన పత్తి ధర

క్వింటం గరిష్ఠంగా రూ. 7,699


విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ పత్తి ధర రోజురోజుకూ పెరుగుతోంది. గురువారం పత్తి ధర క్వింటాలు గరిష్ఠం రూ. 7,699 పలికింది. వారం రోజుల్లో క్వింటానికి రూ.400పైగా ధర పెరిగింది. ఆర్థిక సంవత్సరం ముగిస్తుండడంతో పత్తి ధరల్లో కదలికలు వచ్చాయి. గత నెల రోజులుగా స్థిరంగా ఉన్న ధరలు మళ్లీ పెరుగుతుండడంతో పత్తి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దూది బేళ్ల ఎగుమతులు పెరగడంతో, అంతర్జాతీయ మార్కెట్‌లో ధరుల పెరగడం స్థానిక మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు పెరగడానికి కారణమైందని వ్యాపారులు చెబుతున్నారు. 664 క్వింటాళ్ల పత్తి విక్రయానికిరాగా వాటి కనిష్ఠ ధర రూ.5,089, గరిష్ఠ ధర రూ. 7699, మధ్యస్థ ధర 7,379 పలికింది.

వసూల్ రాజా...!

ఎవర్నీ వదలకుండా దోచుకోవడమే ఆయన మొదటి పని అయితే నోటికొచ్చినట్టు బండ బూతులు తిట్టడం రెండో పని. గట్టిగా అరవడం, తిట్ల దండకం అందుకోవడం వంటి చర్యలతో ముందుగా షాపుల యజమానులు, రోడ్డు సైడు వ్యాపారులను భయాందోళనకు గురి చేస్తాడు. ఆ తరువాత వారి నుంచి మామూళ్లు రాబట్టడానికి తన డ్రైవర్, రైటర్‌ను ఉసిగొల్పుతాడు. ఇలా పెద్ద పెద్ద షాపింగ్ కాంపెక్స్ యజమానులు మొదలుకొని రోడ్డు సైడు వ్యాపారుల వరకు ఆయనకు డబ్బులు ముట్టజెప్పాల్సిందే. అలాగే నగరంలోకి వచ్చే మట్టి, ఇసుక తదితర టిప్పర్ల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నాడన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తాజాగా ఆటో స్టిక్కర్ల పేరుతో దోపిడీ చేస్తున్నారని సమాచారం.

- డ్రైవర్, రైటర్‌ను అడ్డుపెట్టుకొని ఓ ట్రాఫిక్ పోలీసు అధికారి దందా
- రోడ్డు సైడు వ్యాపారులనూ వదలని వైనం
- ఇసుక, మట్టి టిప్పర్ల నుంచి నెలవారీ మామూళ్లు
- ఆటో స్టిక్కర్ల పేరుతోనూ దోపిడీ
- నోరు తెరిస్తే బూతు పురాణమే
- హడలెత్తిపోతున్న షాపుల యజమానులు





నంద్యాల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో పని చేసే ఓ పోలీసు అధికారిపై పోలీసు వృత్తిలోకి వచ్చిన మొదట నుంచే అనేక ఆరోపణలు ఉన్నట్లు ఆ శాఖ వర్గాల నుంచి తెలుస్తోంది. ఇతర జిల్లాల్లో పని చేసిన సందర్భాల్లోనూ పలు అవినీతి ఆరోపణలు రావడంతో శాఖ పరమైన చర్యలకు గురైనట్టు సమాచారం. అయినప్పటికీ సదరు అధికారిలో మాత్రం మార్పు కనిపించడం లేదు. వాహనచోదకులు, హోటళ్ల, వ్యాపార దుకాణాదారులు, పలు షాపింగ్ మాల్స్ యజమానాలు అనే తేడా లేకుండా ట్రాఫిక్ నిబంధనల పేరుతో సదరు అధికారి బెదిరింపులు, బూతు పురాణాలతో హడలెత్తిస్తున్నారు. తమ కింద పని చేసే సిబ్బందిపై కూడా ఇదే తరహాలో తిట్ల దండకం అందుకుంటారని ఆశాఖ వర్గాల్లోనూ చర్చ ఉంది. ఈ నేపథ్యంలో కొందరు సిబ్బంది సదరు అధికారి కింద పని చేయకలేక.. ఇతర ప్రాంతాలకు వెళ్లిపోగా.. మరికొందరు తాజాగా బయటకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

ట్రాఫిక్ సమస్య పేరుతో వసూళ్లు

నగరంలో ఎక్కడ చూసినా ట్రాఫిక్ సమస్య ఉన్న విషయం తెలిసిందే. మున్సిపల్ అధికారులు ఇష్టారాజ్యంగా భవనాలకు అనుమతులు ఇవ్వడంతో ఆయా యజమానులు సైతం రోడ్లను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేసేశారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు కూడళ్లలో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువైంది. ఇదే అదునుగా భావించి సదరు ట్రాఫిక్ పోలీసు అధికారి నిబంధనల పేరుతో వాహనచోదకుల నుంచి ఫుట్‌పాత్ దుకాణాలు, పలు హోటళ్లు, షాపింగ్ మాల్స్, మద్యం దుకాణాలు, బార్‌ల వరకు నెలవారీ మామూళ్లకు తెరలేపారని సమాచారం. ఇది చాలదన్నట్లు.. నగరంలో ఇసుక, మట్టి, కంకర తరలించే వాహనాలపై తమదైన శైలిలో అధిక లోడు, బడా వాహనాలు, అక్రమ రవాణా పేరుతో బెదిరించి వీరితో కూడా నెలవారీ మామూళ్లు పెద్దఎత్తున వసూలు చేస్తున్నారని తెలిసింది. ఇటీవల నగరంలో ఓ హోటల్ యజమానితో కూడా సదరు పోలీసు అధికారి వాగ్వాదానికి దిగి ఆ తరువాత చేతివాటం ప్రదర్శించారని సమాచారం. ప్రధానంగా మంత్రి ఫరూక్ క్యాంప్ కార్యాలయం సమీపంలోని ఓ కూల్ డ్రింక్ షాపు ఫుట్‌పాత్ మీద పెట్టారని బెదిరించి రూ. 25 వేలు తీసుకున్నట్లు సమాచారం. ఇలా పలు దుకాణాదారులను బెదిరించి అక్రమ వసూళ్లకు బరితెగించారని బాధిత వర్గాల నుంచి తెలిసింది. జరిమానాల విషయంలోనూ ఈ ముగ్గురు చేతివాటం ప్రదర్శించి సొమ్ము చేసుకుంటున్నారని సమాచారం. కోర్టుకు వెళ్లే వాహనాదారుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేసి క్యాష్ చేసుకుంటున్నారని తెలిసింది.


ఆటో స్టిక్కర్ల పేరుతోనూ దోపిడీ..

సదరు అధికారి తమదైన శైలిలో అందినకాడికి దోచుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నారనే ప్రచారం నగరంలో జోరుగా ఉంది. పై నుంచే వచ్చే అక్రమ ఆదాయం చాలదన్నట్టుగా భావించి.. నగరంలోని ఆటోలకు స్టిక్కర్లు వేయడం మొదలెట్టాడు. ఈ క్రమంలో ఆయా ఆటోలకు రేడియం స్టిక్కర్ వేయడం అంటే... రూ. 150 నుంచి.. రూ. 250 వరకు ఖర్చు అవుతుందనే విషయం అందరికీ తెలిసిందే. అయితే సదరు అధికారి ఇక్కడ కూడా తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శించి ఒక్కొక్క ఆటో నుంచి సుమారు.. రూ.400 నుంచి..రూ. 1000 వరకు వసూలు చేశారని సమాచారం. ఇదే క్రమంలో రికార్డులు సక్రమంగా లేకపోతే అంతే సంగతులు. రికార్డులు సక్రమంగా లేవని సాకుగా చూపి రూ.1500 నుంచి రూ. 3000 వరకు అక్రమంగా వసూలు చేశారని బాధిత వర్గాల నుంచి తెలుస్తోంది. ఈ వ్యవహారమంతా కూడా ఓ ఏజెన్సీ ద్వారా సాగిందని సమాచారం. అయితే ఇందులో సిబ్బంది పాత్ర కూడా ఎక్కువ ఉందని సమాచారం. ఒక్క మాటలో చెప్పాలంటే ఆటో స్టిక్కర్ల రూపంలోనూ సదరు పోలీసు అధికారి ఇలా అక్రమ వసూళ్లకు తెరలేపడం చర్చనీయాంశంగా మారింది.



నగరంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్

మిగతా 6వ పేజీలో



అ.. అంటే అడవి

- అమ్మలాంటి అడవే ప్రాణికోటికి జీవనాధారం
- భూమిపై 31శాతం మాత్రమే అటవీ విస్తీర్ణం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేవలం 19 శాతమే
- నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం

పర్యావరణంలో అడవి కేంద్రస్థానంలో ఉంటుంది. ప్రకృతిలోని సకల జీవరాశుల మనుగడకు అడవులే అమ్మలా అండగా ఉంటాయి. వర్షాలు కురవడానికి, కాలుష్యాన్ని నివారించేందుకు అడవులు రక్షణ కవచాలు. అడవులు ప్రకృతి నిధులుగా, సహజ సంపదలుగా మానవాళిని కాపాడుతూ ఉంటాయి. వేల సంవత్సరాల నుంచి భారతీయ నాగరికతలో అడవుల ప్రాధాన్యత మహత్తరమైనది. అయితే ప్రభుత్వ విధానాల వల్ల విలువైన అటవీ సంపద ఏటేటా అంతరిస్తోంది. దీని పర్యావరణానికి విపత్తు కలుగుతోంది. మానవ అస్తిత్వానికే ముప్పు వాటిల్లుతోంది. అడవుల ప్రాముఖ్యతను ప్రచారం చేయడానికి ప్రపంచదేశాలన్నీ కలిసి మార్చి 21ని ప్రపంచ అటవీ దినోత్సవంగా నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

ఆత్మకూరు, మార్చి 20: అడవే ప్రాణికోటికి జీవన ఆధారం అడవులు సమృద్ధిగా వుంటే సకాలంలో వర్షాలు కురుస్తాయి. వ్యవసాయరంగం ఊపందుకుంటుంది. తద్వారా మిగతా అన్ని రంగాలకు ప్రయోజనం కలుగుతుంది. వాతావరణ కాలుష్యం నియంత్రణలో ఉంటుంది. ప్రతిజీవికి శుద్ధమైన అక్సిజన్ లభ్యమవుతుంది. భూమి వేడెక్కకుండా చేయడంతో భూగర్భజలాలు పెరిగే అవకాశం లేకపోలేదు. ప్రపంచవ్యాప్తంగా అడవుల్లో కురిసే వర్షాల ద్వారా మూడో వంతు ప్రపంచ జనాభాకు దాహం తీరుస్తుందని ఐక్యరాజ్యసమితి లెక్కల ద్వారా తెలుస్తోంది. అడవులు అభివృద్ధి చెందితే వన్యప్రాణుల సంతతి మెరుగుపడుతుంది.

జనచైతన్యంతోనే అడవుల అభివృద్ధి సాధ్యం:

ప్రభుత్వ పర్యావరణ వ్యతిరేక విధానాల వల్ల అనేక ప్రకృతి వినాశక సంఘటనలు జరిగి మానవ మనుగడకే ప్రమాదంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో అడవుల సంరక్షణపై ప్రజల్లో చైతన్యం కలిగితే తప్ప అడవుల రక్షణ సాధ్యపడదని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక, అభివృద్ధి విధానాల వల్ల అడవులు పెద్ద ఎత్తున ధ్వంసం అవుతున్నాయి. పర్యావరణ సమస్య అతి పెద్ద అంతర్జాతీయ సమస్యగా మారింది. 33శాతం ఉండాల్సిన అడవులు ప్రభుత్వ విధానాల వల్ల అంతరించిపోతున్నాయి. దీన్ని నిలదీయడానికి ప్రజలు చైతన్యవంతం కావాలని పర్యావరణ వేత్తలు అంటున్నారు. ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా, పర్యావరణ వ్యతిరేకంగా విధానాలు అమలు చేస్తుండగా ఇండ్లలో, పొలం గట్ల మీద మొక్కలు పెంచడం వల్ల సమస్య పరిష్కారం కాదనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. అటవీ చట్టాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం కార్పొరేట్లకు అనుమతులు ఇవ్వడం వల్ల అటవీ విపత్తు తీవ్రమైందనే గణాంకాలు ఎన్నో అందుబాలులో ఉన్నాయి.



జిల్లాలో 19శాతమే అడవుల విస్తీర్ణం

భూవిస్తీర్ణంలో 33శాతం అడవులు ఉంటేనే మానవ మనుగడకు విఘాతం ఉండదని నిపుణులు చెబుతున్నారు. అయితే మన ఉమ్మడి కర్నూలు జిల్లాలో మాత్రం 19శాతం మాత్రమే అడవుల విస్తీర్ణం వున్నట్లు అధికారి రికార్డుల ద్వారా తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 17,658 చ.కి.మీల విస్తీర్ణం వుండగా అందులో 3446చ.కిమీల విస్తీర్ణంలో మాత్రమే అడవులు విస్తరించాయి. అందులో 1228.11చ.కిమీల అటవీ విస్తీర్ణం ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ పరిధిలో ఉండటం గమనార్హం. కర్నూలు జిల్లాలోనే పరిస్థితి ఇలా ఉంటే అడవుల విస్తీర్ణం అంతగా లేని అనంతపురం లాంటి కరువు జిల్లాల పరిస్థితి ఏ విధంగా వుందో అర్థం చేసుకోవచ్చు.





అడవికి అండ ఆదివాసులే

వందల ఏళ్ల నుంచే అడవి తల్లికి ఆదివాసులే అండగా నిలుస్తున్నారు. గతంలో అటవీ రక్షణలో అధికారుల చెంచుల సాయాన్ని తీసుకునేవారు. అదే విధంగా అడవుల్లో ఎక్కడెక్కడ నీటినిల్వలు ఉన్నాయి, ఏఏ ప్రాంతాల్లో క్రూరమృగాలు సంచరిస్తాయి, అరుదైన వృక్షజాతులేంటి అనే విషయాలు చెంచులు సులభంగా గుర్తిస్తారు. అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగించే గిరిజనులు అడవి తల్లికి కంటికి రెప్పలా కాపాడుకుంటారు. అయితే ప్రస్తుతం అటవీ రక్షణలో చెంచులకు అటవీశాఖ సరైన ప్రాముఖ్యత కల్పించడం లేదు.

అందరూ బాధ్యతగా వ్యవహరించాలి



అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. అడవుల వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. అడవుల సంరక్షణ కోసం అటవీ శాఖ ఎంతగానో కృషిచేసినా ప్రజల్లో చైతన్యం కలిగినప్పుడే అడవుల సంరక్షణ సాధ్యం.

– వి. సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్

వసూల్ రాజా

(5వ పేజీ తరువాయి)


నగరంలో ట్రాఫిక్

సదరు పోలీసు అధికారి ట్రాఫిక్‌లో పని చేస్తున్న సిబ్బందిపై ఒక్కొక్కరిపై ఒక్కో రకమైన భావనతో వ్యవహరిస్తుండటం ఆశాఖ వర్గాల్లో చర్చకు దారి తీసింది. కొందర్నైయితే విధుల పేరుతో పలు రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎవరైనా సిబ్బంది ప్రశ్నిస్తే అంతే సంగతులు ట్రాఫిక్ ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో డ్యూటీ వేయడం.. బహిరంగానే బూతులు తిట్టడం వంటి చర్యలతో వారు మానసిక వేదనకు గురవుతున్నారు. సదరు పోలీసు అధికారి అక్రమార్జన గుట్టు బయట పడకుండా డ్రైవర్, సదరు స్టేషన్‌లోని రైటర్ చక్రం తిప్పుతున్నారని ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది. పైగా సదరు డ్రైవర్ ఏఆర్ నుంచి ఇక్కడికి వచ్చి ఏళ్ల తరబడి పాతుకుపోయారని తెలుస్తోంది. ఇదే క్రమంలో ఏళ్ల తరబడి ట్రాఫిక్‌లో పని చేసిన అనుభవం ఉండటంతో.. సదరు అధికారి కూడా సదరు డ్రైవర్‌ను అడ్డుపెట్టుకుని మరీ అక్రమ వసూళ్లు జోరుగా కొనసాగిస్తున్నారని సమాచారం.

వణికిపోతున్న వాహనచోదకులు, దుకాణదారులు..

సదరు ట్రాఫిక్ పోలీసు అధికారితో పాటు డ్రైవర్, రైటర్ వ్యవహారంతో స్టేషన్‌లో పని చేస్తున్న కొంతమంది సిబ్బందితో పాటు.. పలు వాహనచోదకులు, దుకాణాదారులు, హోటల్, షాపింగ్ మాల్స్ తదితర వ్యాపార సముదాయాల యజమానులు వణికిపోతున్నారు. ఏ సమయంలో ఎలాంటి బూ తులు ఆయన నోటి నుంచి వినాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ట్రాఫిక్ నిబంధనల పేరుతో ఈ ముగ్గురు చేస్తున్న అక్రమ వసూళ్లపై నంద్యాల జిల్లా కేంద్రంలో పెద్ద దుమారం రేగుతోంది. తనపై అధికారులు జిల్లా కేంద్రంలోనే ఉన్నప్పటికీ సదరు ట్రాఫిక్ పోలీసు అధికారి తీరు దురుసుగా ప్రవరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. పలువురు వ్యాపారులు, వాహనచోదకులు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు సైతం ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

అక్రమాలకు పాల్పడితే చర్యలు...



ట్రాఫిక్ నిబంధనలను పేరుతో ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్‌లో కొందరు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. త్వరలోనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. సిబ్బందికి ఏదైనా సమస్య ఉంటే మా దృష్టికి తీసుకు రండి. అక్రమ వసూళ్లపై లోతుగా విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటాం.

-ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు

రూ. 7.89 కోట్లు: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 24 సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు రూ.7.89 కోట్లు మంజూరయ్యాయని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం అన్ని శాఖల జిల్లా అధికారులతో అభివృద్ధి కార్యక్రమాల అమలు, పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో మంజూరైన కొత్త టాయిలెట్‌ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాల మరమ్మతులను పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి రూ.2.49 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. విలేజ్ లెవెల్ ఫాం మెషినరీ కింద డ్రోన్స్ మంజూరు చేసేందుకు 40 గ్రూపులను ఐడెంటిపై చేయాలని వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా 50 శాతం సబ్సిడీ యంత్ర పరికరాలును మార్చి 31లోపు రైతులకు అందజేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గోకులాల నిర్మాణాల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని, డ్వామా పీడీని ఆదేశించారు. విశ్వకర్మ యోజన కింద లబ్దిదారులకు త్వరితగతిన రుణాలు అందించే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, సీపీవో హిమప్రభాకర్ రాజు, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కవితా...ఓ కవితా...!

నేడు ప్రపంచ కవితా దినోత్సవం



కర్నూలు కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 'కుక్కపిల్లా...సబ్బుబిళ్లా...అగ్గిపుల్లా...కాదేదీ కవితకనర్హం, హీనంగా చూడకు దేన్నీ ! కవితామయమేనోయ్ అన్నీ!' అంటూ కవులను ప్రోత్సహిస్తూ 'ప్రపంచమొక పద్మవ్యూహం ! కవిత్వమొక తీరని దాహం..!!' అని కవితను ముగిస్తాడు మహాకవి శ్రీశ్రీ. ఈ కవితలో గొప్ప భావ సంపద ఇమిడి ఉన్నది. ఆధునిక కాలంలో యువ కలాలు తమదైన, పదునైన గొంతుతో కవిత్వానికి ప్రాణం పోస్తున్నారు. జిల్లాలో తరచుగా జరిగే సాహిత్య సభల్లో విడుదల అవుతున్న కవితా సంపుటాలే ఇందుకు ఉదాహరణ. సాహిత్యంలో కవిత్వానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. తెలుగు భాషలో ప్రాచీన కవిత్వం దశ ఒక పద్ధతిలో సాగితే, శ్రీశ్రీకి తర్వాత ఆధునిక సాహిత్యం అభ్యుదయ పథంలో నడిచింది. సామాజిక జీవన స్థితిగతులను ఎందరో కవులు తమ కలాల ద్వారాల జారువాల్చి, ప్రజల్లో సచేతన భావాలను నింపడంతో విజయం సాధించారు. ఇంకా సాధిస్తూనే ఉన్నారు. కవిత్వం చేసే గొప్ప ఉపకారం ఏమంటే మనిషి జీవితానుభవాన్ని పెంచడం, మనిషికి ఉన్నత గుణాలను అలవరచేలా చేయడం. ఈ నేపథ్యంలోనే యునెస్కో (ఐక్యరాజ్యసమితి-విద్యా, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ) 1999లో ఫ్రాన్స్ దేశంలోని పారిస్‌లో జరిగిన 30వ జాతీయ సమావేశంలో మార్చి 21న ప్రపంచ కవితా దినోత్సవాన్ని ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా కవిత్వాన్ని చదవడం, రాయడం, బోధించడాన్ని ప్రోత్సహిస్తూ మానవ అనుభవ సారాన్ని సంగ్రహించడానికి, సృజనాత్మకత ఊహలను ప్రేరేపించడానికి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

కవితా దినోత్సవ ఉద్దేశం ఇదీ...


ప్రపంచ కవితా దినోత్సవ ఉద్దేశం కవిత్వం ప్రాముఖ్యతను విస్తృత పరచడం. తద్వారా శాంతి, సమాజిక న్యాయాన్ని ప్రోత్సహించడం. విద్యలో కవిత్వం పాత్ర ప్రాముఖ్యతను, కవిత్వం ద్వారా బహుభాషావాదం, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరాలపై ఆయా దేశాలన్నీ దృష్టి సారించాయి. 2021లో కవితా దినోత్సవం ఇతివృత్తం 'కవిత్వంలో కొత్త స్వరాలు' ఇది ఔత్సాహిక కవులను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

పది పవిత్ర రాత్రులు

- రంజాన్ మాసంలో అత్యంత కీలకం
- నేటి నుంచి ఆరంభం
- విద్యుత్ మెరుపులతో కళకళలాడుతున్న మసీదులు

కొలిమిగుండ్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పవిత్ర మాసంలో చివరి పది రోజులకు విశిష్టమైన ప్రత్యేత ఉంటుంది. మార్చి 2 నుండి పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం నుండి పది పవిత్ర రాత్రులు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా జిల్లాలోని మసీదులు ప్రత్యేక అలంకరణలతో కళకళలాడుతున్నాయి. రంగు రంగుల విద్యుత్ దీపాలు, కాగితాల వెలుగులతో కొత్త శోభను సంతరించుకున్నాయి. అధిక సంఖ్యలో తరలివస్తున్న భక్తుల ప్రత్యేక ప్రార్థనలతో మసీదులు కిటకిటలాడుతున్నాయి.

రంజాన్ మాసాన్ని ప్రవక్త మూడు భాగాలుగా విభజించాడు. ఇందులో మొదటి పది రోజులు కారుణ్యం కోసం కాగా, తర్వాతి పది రోజులు విమోచనం కోసం. మిగిలిన చివరి పది రోజులు నరకాగ్ని నుంచి విముక్తి పొందేందుకు అల్లాహ్‌ను వేడుకోవడం. ఇలా చివరి పది రోజులకు మోక్షం లభించే రోజులుగా రంజాన్ మాసంలో ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈపది రోజుల్లో వచ్చే బేసి రాత్రుల్లోనే దివ్య ఖురాన్ అవతరణ జరిగిందని అంటారు. అందుకనే అత్యంత భక్తి శ్రద్ధలతో ఈబేసి రాత్రుల్లో జాగరణ చేస్తూ మసీదుల్లోనే గడపడానికి భక్తులు ఎక్కువ ఆసక్తి చూపుతారు. దీన్నే ఏతేకాఫ్ అంటారు. సంవత్సరంలోని రాత్రుల్లన్నింటిలోకెల్లా అత్యుత్తమ రాత్రిగా చెప్పబడే షబేఖదర్ ఈ చివరి పది రాత్రుల్లోనే వస్తుందని మత పెద్దలు బోధిస్తారు. ఈ రాత్రి వెయ్యి నెలల కంటే శ్రేష్ఠమైన రాత్రి అని ఖురాన్ వెల్లడిస్తోంది. ఈ పవిత్ర రాత్రి సృష్టి కర్త అల్లాహ్ ఆరాధనలో గడిపేవారికి వెయ్యి నెలల కంటే ఎక్కువ కాలం దైవారాధనలో గడిపిన పుణ్యఫలం లభిస్తుందని భక్తులు నమ్మకం. రంజాన్ మాసంలో ఫలానా రాత్రే షబేఖదర్ వస్తుందనే స్పష్టత లేదు. రంజాన్ మాసంలోని చివరి పది రోజుల్లో ఐదు పవిత్రమైన రాత్రుల్లో షబేఖదర్ ఖచ్చితంగా ఉంటుందని అంటారు. ఈ మాసంలోని 21రోజు, 23, 25, 27, 29వ రోజుల్లో వచ్చే రాత్రుల్లోనే తాఖ్ రాత్(పవిత్రమైన రాత్రి) అంటారు. రంజాన్ మాసంలోని అఖరి పది రాత్రుల్లో బేసి రాత్రుల్లో షబేఖదర్‌ను అన్వేషించాలని మహమ్మద్ ప్రవక్త పేర్కొన్నట్లు ఖురాన్‌లో ఉంది.


నమాజ్ చేస్తున్న దృశ్యం


ముస్తాబైన మసీదు

ఖురాన్ అవతరించిన మాసం



రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనది. ఈ మాసంలోనే పవిత్ర ఖురాన్ అవతరించింది. ఇతరులకు సహాయం చేయడంతో పాటు, దైవారాధనలో నిమగ్నం కావడం పుణ్యఫలాన్నిస్తుంది.

-డి.ఖాదర్‌వలి, ప్రభుత్వ మండల ఖాజీ

ఆరోగ్యానికి ఉపవాస దీక్షలు మేలు చేస్తాయి



రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. రంజాన్ మాసంలో నేను తప్పనిసరిగా ఉపావాస దీక్ష పాటిస్తాను. ఇలా చేస్తే దైవ భక్తితో పాటు ఆరోగ్యానికి సైతం మేలు కలుగుతుంది.

-మహబూబ్‌ఖాన్, రిటైర్డ్ గ్రంథాలయ అధికారి

అల్లా అనుగ్రహం కోసం..



రంజాన్ మాసంలో ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహిస్తాం. గతంలో నిరంతరం మసీదులకు వెళ్లకున్నా, ఈ మాసంలో క్రమం తప్పకుండా నమాజ్ చేస్తే అల్లా అనుగ్రహం లభిస్తుంది.

-హుస్సాన్‌బాషా, కొలిమిగుండ్ల

రమణీయం.. గోరంట్ల మాధవుడి రథోత్సవం


రథోత్సవం పాల్గొన్న భక్తులు, రథంపై ఉత్సవమూర్తులు

కోడుమూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సాయం సంధ్యా వేళ.. హంద్రీతీరాన మాధవుడి రథోత్సవం భక్తులను పరవశింపజేసింది. రథోత్సవ ఆద్యంతం భక్తులు తన్మయత్వంతో గోవిందనామస్మరణ చేశారు. దీంతో హంద్రీతీరం మార్మోగింది. గోరంట్ల లక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం సాయంత్రం అశేష భక్తజనం మధ్య రథోత్సవం వైభవంగా సాగింది. ఆలయంలో విశేష పూజలు, అభిషేకములు నిర్వహించారు. రథాన్ని సుగంధపూల తోరణాలతో ముస్తాబు చేశారు. అనంతరం సాయంత్రం ఆలయ అధికారులు, పూజారులు చేరుకుని రథశాల వద్ద శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. సాత్విక బలిదానం గుమ్మడి, టెంకాయలు సమర్పించారు. వెంటనే భక్తులు రథాన్ని లాగుటకు పోటీ పడ్డారు. ఎదురుమండపం వరకు రథాన్ని లాగి తిరిగి రథమండపం చేర్చారు. ఆపై భక్తులు రథానికి టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. సీఐ తబ్రేజ్ అధ్వర్యంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్‌ఐలు శ్రీనివాసులు, తిమ్మయ్య, తిమ్మారెడ్డి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈవో గురురెడ్డి, సిబ్బంది మురళి, టీడీపీ నాయకులు తిరములనాయుడు, దుబ్బన్న, సద్దల బాలకృష్ణ, సద్దల శీను, మధు, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఏ కన్వెన్షన్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సీఎం చంద్రబాబు హాజరై క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన సభ్యులకు అవార్డులు ప్రదానం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ప్రజా పతినిధులు హాజరయ్యారు.



షటిల్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్, మెన్స్ సింగిల్‌లో విజేతగా నిలిచిన టీజీ భరత్‌కు షీల్డ్ అందజేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇతరులు



బహుమతి ప్రదానోత్సంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, పత్తికొండ, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బీవీ జయనాగేశ్వరరెడ్డి



షీల్డ్ అందుకుంటున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ


పాల్గొన్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

ఫిషింగ్ హార్బర్లను ప్రైవేటీకరించం

- శాసనమండలిలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి ఫిషింగ్ హార్బర్లను ప్రైవేటీకరించే యోచన లేదని రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌళిక సదుపాయాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం శాసనమండలిలో సభ్యులు రాష్ట్రంలో ఫిషింగ్ హార్బర్‌లపై అడిగిన ప్రశ్నలకు మంత్రి బీసీ సమాధానమిచ్చారు. రాష్ట్ర విభజన సమయంలో మూడు ఫిషింగ్ హార్బర్లు పనిచేస్తున్నాయ న్నారు. 2019-24 మధ్య కాలంలో 9 కొత్త ఫిషింగ్ హార్బర్ల నిర్మా ణాలకు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఫిషింగ్ హార్బర్లను ప్రైవేటీక రించే ఆలోచన ప్రభుత్వానికి లేదని మంత్రి సభకు తెలియజేశారు.



ఎస్జీటీల సీనియారిటీ జాబితా విడుదల

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ తత్సమాన అర్హత కలిగిన సీనియారిటీ జాబితాను విడుదల చేసినట్లు డీఈవో శామ్యూల్ పాల్ గురువారం తెలిపారు. ఈ జాబితాను డీఈవో బ్లాక్ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఈ నెల 23న సాయంత్రం లోపు సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో సంప్రదించాలని చెప్పారు.

శ్రీమఠానికి రూ. 3.25 లక్షల విరాళం

మంత్రాలయం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి అమెరికాకు చెందిన భక్తుడు అనంతస్వామి రూ.3.25 లక్షలు దైనందిక సేవకు రూ.1.25 లక్షలు, అన్నదానానికి రూ. లక్ష, గోశాలకు రూ.1లక్ష, విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవ శెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్ తెలిపారు. భక్తుడు గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.3.25 లక్షలు చెక్కును విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు.

నియామక ప్రక్రియ నిలిపివేత

కర్నూలు హాస్పిటల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కడప జోన్-4 పరిధిలోని కాంట్రాక్టు ఫార్మసీ ఆఫీసర్ల ఉద్యోగాలకు సంబంధించిన నియామక ప్రక్రియ (నెం.02/2025) హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ప్రకారం తాత్కాలికంగా నిలిపివేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ (కడప) డా.బి. రామగిడ్డయ్య ఓ ప్రకటనలో తెలిపారు. హైకోర్టు తదుపరి ఉత్తర్వులు వచ్చిన తర్వాత మాత్రమే పరిస్థితిని సమీక్షించి నియామక ప్రక్రియ చేపడుతామని తెలిపారు.

ఏడాది కుమారుడితో శ్రీశైలానికి..

- మల్లన్న సన్నిధికి కన్నడ భక్తులు


గొడుగు నీడలో తల్లి ఒడిలో ఏడాది కుమారుడు మల్లయ్య

కోసిగి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని బాగల్‌కోట జిల్లా బానహట్టి తాలుకాకు చెందిన ఆనంద్ హేరేమట్, జ్యోతి హేరేమట్ దంపతులు ఏడాది కొడుకుతో శ్రీశైలానికి పాదయాత్రగా బయల్దేరారు. వీరికి పెళ్లయి ఏడేళ్లయినా సంతానం కలగకపోవడంతో సొంతూరు నుంచి సుమారు 745 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలానికి ఐదేళ్ళ పాటు పాదయాత్ర చేశారు. 2024లో వారికి కుమారుడు జన్మించాడు. కుమారుడి మల్లయ్య అనే పేరు పెట్టారు. ఏడాది వయస్సు ఉన్న కుమారునితో కలిసి పాదయాత్రగా శ్రీశైలానికి తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకోడానికి బయల్దేరి గురువారం కోసిగి చేరుకున్నారు.

ఫైనాన్స్ కంపెనీ వేధింపులతో మహిళ ఆత్మహత్యాయత్నం

ఎమ్మిగనూరు/ రూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక పట్టణానికి చెందిన వెంకటలక్ష్మి అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారంచోటు చేసుకుంది. బాధితురాలు ఫైనాన్స్ కంపెనీలో 2018లో ఇంటిని తాకట్టుపెట్టి రూ.19లక్షలు లోన్ తీసుకుంది. వివిధ సందర్భాల్లో అప్పు చెల్లించింది. అప్పటి నుండి తనకు ఎన్‌వోసీ ఇవ్వాలని ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యానికి ఫోన్ చేసినా స్పందించలేదని ఆమె అన్నది. మరలా డబ్బు చెల్లిస్తేనే ఎన్‌వోసీ ఇస్తామని చెప్పడంతో ఆమె ఆత్మహత్యాయత్నం చేసింది. అక్కడున్నవారు అడ్డుకున్నారు. ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆమె కోరింది.


పురుగుల మందు డబ్బాతో మహిళ

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్సీ

కర్నూలు అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ బీటీ నాయుడు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడుని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. రెండోరి ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో బీటీని స్పీకర్ అభినందించారు.


స్పీకర్‌తో ఎమ్మెల్సీ బీటీ నాయుడు

దరఖాస్తు గడువు పెంపు

పాణ్యం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ పాఠశాల, కళాశాలలో ప్రవేశానికి గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ ఫ్లోరమ్మ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం, 5 వతరగతి, బ్యాక్‌లాగ్ అడ్మిషన్ల దరఖాస్తు తేదీని మార్చి 25 వతేదీ వరకు పెంచారని, 9866559668, 9440725929 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయుడి తీరు దారుణం

- అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థినులు, తల్లిదండ్రుల ఆందోళన
- ఏనుగుమర్రి హైస్కూల్ వద్ద ఉద్రిక్తత
- సస్పెండ్ చేసిన అధికారులు


విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీఐ

ప్యాపిలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు బొజ్జన్న తీరు దారుణంగా ఉందని, విద్యార్థినులు, ఉపాధ్యాయినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థినులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. గురువారం ఉదయం 8 గంటలకు పాఠశాల వద్దకు వచ్చారు. సమాచారం తెలుసుకున్న ఆ ఉపాధ్యాయుడు విధులకు రాలేదు. ఆగ్రహించిన తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. సీఐ వెంకటరామిరెడ్డి, సిబ్బందితో చేరుకొని ఆందోళనకారులను నిలువరించారు.

ఆ సారు ఉంటే బడి మానుకుంటాం

ఆ సారు తమపై అసభ్య కరంగా వ్యవహరిస్తున్నాడని, ఆయన ఉంటే తాము బడి మానుకుంటామని విద్యార్థినులు చెప్పారు. నోటితో చెప్పలేని విధంగా దుర్భాషలాడుతాడని, బయట చెప్పలేని విధంగా వ్యవహరిస్తాడన్నారు. ఇటువంటి టీచర్‌ను పాఠశాలలో లేకుండా చేయాలని, లేనిపక్షంలో తాము బడి మానుకుంటామని విద్యార్థునులు చెబుతున్నారు.

విద్యాశాఖ మంత్రి స్పందించాలి

విద్యార్థునులతో పాటు తమపై కూడా ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఉపాధ్యాయినులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్, హోంమంత్రి అనిత స్పందించాలని ఉపాధ్యాయినులు కోరారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నంద్యాల నూనెపల్లె/ఎడ్యుకేషన్: నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం ఏనుగుమర్రి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యా యుడిగా పనిచేస్తున్న బొజ్జన్న విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ రాజకుమారి, డీఈవో జనార్దన్‌రెడ్డి గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉపాధ్యాయుడు బొజ్జన్న విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి కావడంతో సస్పెండ్ చేశామని చెప్పారు. విధుల నిర్వహణలో తీవ్ర ఆలసత్వం వహించడమే కాకుండా విద్యార్థినుల పట్ల అసభ్యంగా, దురుసుగా ప్రవర్తించినట్లు ఎంఈవో, డిప్యూటీ ఈవోలు తమ నివేదికల్లో వెల్లడించినట్లు తెలిపారు. విద్యార్థినుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఉపాధ్యాయుడిపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు నివేదికలో పేర్కొనడంతో విద్యార్థినులను విచారించినట్లు తెలిపారు. ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఈఈ బాధ్యతల స్వీకరణ

నంద్యాల మున్సిపాలిటీ మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా శివప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సార్బీసీ సర్కిల్ 2 పరిధిలోని పాణ్యం 2 డివిజన్‌లో బాధ్యతలు స్వీకరించిన ఈఈ శివప్రసాద్‌కు డీఈఈలు వెంకటేశ్వర రెడ్డి, సత్యవిజయకుమార్, రాజశేఖర్, నాగభూషణం, సత్యవిజయకుమార్‌లతో పాటు ఏఈలు పరిపాలన సిబ్బంది నాగేంద్రప్ప తదితరులు అభినందనలు తెలిపారు.

మేయర్ అక్రమ ఆస్తులపై విచారణ జరపాలి : సోమిశెట్టి


మాట్లాడుతున్న కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మేయర్ కోట్ల రూపాయల అక్రమాస్తులు కూడగట్టారని, వెంటనే విచారణ జరిపించాలని 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం నగర పాలక సంస్థ కార్పొరేటర్లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలసాయిబాబ ట్రస్టు నుంచి వ్యక్తిగత ఖాతాకు రూ.85 లక్షలు వేయించుకున్నారని, జొహరాపురం రోడ్డులోని బుడేఖాన్ మసీద్ మాన్యానికి చెందిన 12.30 ఎకరాల భూమిని ఆక్రమించి అనుచరులతో ప్లాట్లు వేయించి అమ్ముకు న్నారని ఆరోపించారు. కార్పొరేటర్ కురువ పరమేష్ మాట్లాడుతూ మేయర్‌కు అన్ని ఆస్తులు ఎలా వచ్చాయో వెల్లడించాలన్నారు. కార్పొరేటర్ జకీయ అక్సారీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి చేద్దామంటే మేయర్ అడ్డు పడుతున్నారని ఆరోపించారు. కార్పొరేటర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ నగరంలో చివరకు చికెన్ వేస్టు తరలించే కాంట్రాక్టు ఇచ్చేందుకు పరశురామ్ అనే వ్యక్తి వద్ద రూ.10 లక్షలు లంచం తీసుకున్నారని ఆరోపించారు. సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, కార్పొరేటర్లు పద్మలతారెడ్డి, మాణిక్యమ్మ, రమణమ్మ, విజయకుమారి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్, బి.రామాంజనేయులు పాల్గొన్నారు.

అవినీతి నిరూపిస్తే రాజీనామా

- ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత దీక్ష



ఆదోని టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అవినీతి చేయలేదని, చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని వైసీపీ నాయకురాలు, కర్నూలు జిల్లాలోని ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ వాల్మీకి శాంత అన్నారు. ఆదోనిలోని కోట్ల సర్కిల్‌లో గురువారం 'జగనన్నా.. న్యాయం చెప్పన్నా' అంటూ నిరసన దీక్ష చేపట్టారు. శాంత మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల అనంతరం చైర్ పర్సన్ పోస్టుకు రూ.కోట్లలో బేరం జరుగుతున్నా అవినీతి మచ్చలేని తన పేరును జగనన్న ఎంపిక చేశారన్నారు. అక్రమ బిల్లులను మంజూరు కాకుండా అడ్డుకున్నందుకే తనను పదవి నుంచి దించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి కూడా తన వివరణ తీసుకోకుండానే తమ పార్టీకి చెందిన అసమ్మతి కౌన్సిలర్లతో కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం కోరడం అర్థరహితమన్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడం కోసం ఓ కౌన్సిలర్ మిగతా కౌన్సిలర్లకు ముందస్తుగా రూ.50 వేలు పంపిణీ చేశారని, తనను ఒడిస్తే మరో రూ.లక్ష ఇవ్వడానికి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. ఓ వైస్ చైర్మన్‌కు రూ.5 లక్షలు, ఓ మాజీ ప్రజాప్రతినిధికి పెద్ద మొత్తం అందజేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. అవిశ్వాసంపై జగనన్నకు ఫిర్యాదు చేశానని, సమాధానం కోసం ఎదురు చూస్తున్నానని ఆమె చెప్పారు.

పాతాళగంగలో విద్యార్థి మృతి

శ్రీశైలం మార్చి 20(ఆంధ్రజ్యోతి): పాతాళగంగ మెట్ల మార్గం వద్ద విషాదం చోటు చేసుకుంది. వివరాలివి.. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు గురువారం శ్రీశైలం పాతాళగంగలో దిగారు. వీరిలో కులు కుతుబ్‌షా కళాశాలలతో పాలిటెక్నిక్ డిప్లమా చదువుతున్న సాయి తేజ(18) ఈత రాక నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడు కరీంనగర్ జిల్లా జమ్మికుంట వాసి, హైదరాబాద్ ఉప్పుగుడా హస్టల్‌లో ఉంటు చదువుకుంటున్నాడు. శ్రీశైలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి జైలు, జరిమానా

కర్నూలు లీగల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను వేధించిన నిందితుడికి రెండు సంవత్సరాల కారాగార శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ కర్నూలు పోక్సో కోర్టు న్యాయాధికారి ఇ.రాజేంద్రబాబు గురువారం తీర్పు చెప్పారు. ఆదోని మండలం చిన్నహరివాణం గ్రామానికి చెందిన నిందితుడు రామకృష్ణారెడ్డి (22) ఓ బాలికతో చనువుగా ఉండేవారు. బాలిక ఇంటర్మీడియట్ పూర్తి చేసి కర్నూలులోని ఒక ప్రైవేటు కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరంలో చేరింది. నిందితుడు తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. అతను మద్యానికి అలవాటు పడ్డాడని తెలిసి బాలిక మాట్లాడటం మానేసింది. దీంతో ఓ రోజు నిందితుడు నేరుగా ఆమె చదువుకుంటున్న కళాశాలకే వచ్చి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. బాలిక తాత పెద్దల సమక్షంలో నిందితుడ్ని హెచ్చరించి పంపించేశాడు. అయినా వేధిస్తుండటంతో విసిగిపోయిన బాలిక తల్లిదండ్రులతో కలిసి ఉలింద కొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాలిక మైనర్ కావడంతో నిందితునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆ తర్వాత నిందితున్నిఅరెస్టు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో నిందితునిపై నేరం రుజువు కావడంతో రెండు సంవత్సరాల కారాగార శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ఆ జరిమానాతో పాటు నష్టపరిహారం కూడా బాలికకు చెల్లించాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీవీ శ్రీనివాసులు వాదించారు.

డిప్యూటీ సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత


కూటమి నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22న ఓర్వకల్లు మండలం పూడిచెర్లకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రానున్నారని విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత పిలుపునిచ్చారు. గురువారం మాధవీనగర్‌లోని గౌరు నివాసంలో ఎన్డీఏ కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పాణ్యం నియోజకవర్గం అభివృద్ధికి కేంద్ర బిందువుగా మారనుందని, ఇప్పటికే ఇండస్ట్రీయల్ కారిడార్‌గా ఓర్వకల్లు శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. పూడిచెర్ల గ్రామంలో ఫారం పాండ్ ఏర్పాటుకు భూమిపూజ చేసి అనంతరం బహిరంగసభలో పాల్గొంటారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపి నాయకులు కార్యకర్తలు సభను విజయవంతం చేయాలన్నారు. చింతా సురేష్‌బాబు, రవీంద్ర సుబ్బయ్య, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి. రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి సరోజనమ్మ

కర్నూలు లీగల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలని కర్నూలు ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి జి.సరోజనమ్మ విద్యార్థులకు సూచించారు. స్థానిక పసుపుల గ్రామంలోని ప్రభుత్వ ఉన్న త పాఠశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. పోక్సో చట్టం ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని, 18ఏళ్ల లోపు వయసు గల పిల్లల పై వేధింపులకు పాల్పడకుండా ఈ చట్టం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో తాలుకా ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, హెడ్ మాస్టర్ విజయమ్మ, అధ్యా పకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రంలోని జహారాబాద్‌లో ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు జరిగే 46వ జాతీయ స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు మహ్మద్ రఫీ, షేక్ అశ్రావుల్ ఎంపికయ్యారు. సత్యసాయి జిల్లా కదిరిలో జరిగిన 46వ రాష్ట్ర స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో జిల్లా నుంచి ప్రతిభ కనబరిచి ఏపీ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు జిల్లా సంఘం కార్యదర్శి పి.సువర్ణ గురువారం తెలిపారు.

చెత్త వాహనాలను పునరుద్ధరించాలి: సీపీఎం

కర్నూలు న్యూసిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నగరంలో చెత్తను సేకరించే వాహనాలను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన వెంటనే ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించడానికి 100 క్యాబ్ ఆటోలను ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ఏర్పాటు చేశారన్నారు. సుమారు మూడేళ్లు ప్రజల ఇండ్ల దగ్గరికే వాహనాలు వచ్చి చెత్త సేకరించేవని అన్నారు. ప్రస్తుతం వాహనాలను నిలిపివేయడంతో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోతుందన్నారు. తక్షణమే చెత్త వాహనాలను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

పన్నులు చెల్లించకుంటే చర్యలు

కర్నూలు న్యూసిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీలోగా పన్నులు చెల్లించకుంటే చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ తెలిపారు. గురువారం నగర పాలక ఆస్తి, తాగునీటి కొళాయి పన్నులు, ట్రేడ్ లైసెన్సు రుసు ముల వివరాలను వెల్లడించారు. ఆస్తి పన్ను అసెస్‌మెంట్లు మొత్తం 1,16,305 ఉండగా డిమాండ్ రూ.94.73 కోట్లు ఉంది. ఇందులో రూ.58.74 కోట్లు వసూలు చేయడంతో 62 శాతం ఉంద న్నారు. తాగునీటి కొళాయిల అసెస్‌మెంట్లు మొత్తం 66,987 ఉండగా డిమాండ్ రూ.19.84 కోట్లకు రూ.5.83 కోట్లు వసూలు చేశారు. 29.41 శాతం ఉందన్నారు. అదే విధంగా ట్రేడ్ లైసెన్సుల సంఖ్య 11,222 ఉండగా డిమాండ్ రూ.4.51 కోట్లకు రూ.1.08 వసూలు చేయగా 24.05 శాతం ఉందన్నారు. పన్నుపై ప్రతి వందకు రూ.2 చొప్పున ఆలస్య రుసుము వసూలు చేస్తామన్నారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ఆరంభమై జూన్ వరకు డిమాండ్ నోటీసులు పంపిస్తారన్నారు.

గోకులం షెడ్డు నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

సి.బెళగల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్డు నిర్మాణాలను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ ఏఈ వెంకట్ ప్రకాశ్ రైతులకు సూచించారు. గురువారం పోలకల్లు, ముడుమాల, సి.బెళగల్ గ్రామాల్లో నిర్మిస్తున్న గోకులం షెడ్డు నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబుకార్డు ఉన్నవారంతా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీవో రామన్న, ఈసీ రంగస్వామి ఉన్నారు.

వేతనాలు పెంచాలి

కర్నూలు హాస్పిటల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102లో పని చేస్తున్న డ్రైవర్ల వేతనాలను పెంచాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి రంగస్వామి, కోశాధికారి ఎన్.నరేంద్ర రెడ్డి ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 31వ తేదీ తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ టెండర్లు ముగియనున్నాయని, గత 9 సంవత్సరాలుగా రూ.7870 జీతానికే పని చేస్తున్నామన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పని చేస్తున్న తమను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని కొత్త టెండర్లు వేసి జీతాలను పెంచాలని కోరారు.

మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి

లాడ్జి ఎదుట చెత్త వాహనంతో నిరసన



లాడ్జి ఎదుట చెత్త వాహనంతో నిరసన తెలుపుతున్న కార్పొరేషన్ సిబ్బంది

కర్నూలు న్యూసిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో మొండి బకాయిలపై నగర పాలక సంస్థ ప్రత్యేక దృష్టిక సారించింది. కొంతకాలంగా విన్నూత్న కార్యక్రమా లతో పన్ను బకాయిదారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. స్థానిక దేవనగర్‌లోని ఎంఎస్9 లాడ్జి యాజమాన్యం గత ఏడేళ్లుగా రూ.3,31,250లు నగర పాలకకు ట్రేడ్ లైసెన్సు రుసుములను చెల్లించడంలో నిర్లక్ష్యం వహించింది. ఈ నేపథ్యంలో గురువారం కార్పొరేషన్ సిబ్బంది లాడ్జి ఎదుట చెత్త వాహనం నిలిపి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటరి ఇన్స్‌పెక్టర్ అనిల్, అడ్మిన్లు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేంద్ర నాయుడు

కర్నూలు అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేంద్ర నాయుడు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి అంబటి రామ కృష్ణ యాదవ్, ఏఐవైసీ సెక్రటరీ మమతా నాగిరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామరావు, నంద్యాల డీసీసీ జె.లక్ష్మీనరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, షేక్ జిలాని, అసెంబ్లీ నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను వినియోగించుకోవాలి

కర్నూలు అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను ఆర్యవైశ్యులు వినియోగించుకోవాలని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ లోపు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పది, డిగ్రీ చదివి నిరుద్యోగులుగా ఉంటున్న 21 నుంచి 60 సంవత్సరాల లోపు వారు అర్హులని, వారు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. లక్ష నుంచి రూ.5లక్షల వరకు రుణం ఇస్తారని, 40 శాతం నుంచి 50 శాతం వరకు సబ్సిడీ కింద అందజేస్తారని, జనరిక్ మందుల షాపుకు రూ.8లక్షలు 50 శాతం సబ్సిడీ కింద ఇస్తారని తెలిపారు.

మీటర్ రీడర్లకు ఉపాధి చూపాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప



ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కల్లూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. విద్యుత్ మీటర్ రీడర్స్ యూని యన్, ఏఐటీయూసీ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు జి.రాజు అధ్యక్షతన కర్నూలు విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిం చారు. ఈసందర్భంగా మునెప్ప మాట్లాడుతూ 20 ఏళ్లుగా విద్యుత్‌శాఖలో మీటర్ రీడర్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్‌మీటర్ల వల్ల ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు నెలల క్రితం ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ మీటర్ రీడర్లకు ఎస్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని జీఓ ఇచ్చినప్పటికీ అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు పీస్ రేట్ల ప్రకారం బిల్లుల డబ్బులు చెల్లించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హమీద్, నరసింహా రెడ్డి, వీరేష్, వేదవసముని పాల్గొన్నారు.

నేడు అరసం ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవం

కర్నూలు కల్చరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయితల సంఘం (అరసం) నగర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నగరంలోని చిన్నపార్కు సమీపంలోని ఎస్టీయూ భవన్‌లో ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ ఎం.హరికిషన్ తెలిపారు. విశిష్ట అతిథులుగా ఆదవాని హను మంతప్ప, ఎస్ ముర్తుజా, ఎస్‌డీవీ అజీజ్, చిన్నావుల వెంకట రాజారెడ్డి, గనుమాల మునిస్వామి హాజరవుతారన్నారు. అరసం ప్రతినిధులు రాణి లీలావతి, జీవీ ప్రమోద్ చక్రవర్తి, పుల్లా రామాంజినేయులు, దాసరి వెంకటరమణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో 25 మంది కవులు తమ కవితలు వినిపిస్తారని ఆయన పేర్కొన్నారు.

● సాహితీ స్రవంతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సి.క్యాంపులోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు స్రవంతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల బసప్ప, చక్రపాణి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన 10 మంది కవులు తమ కవితలు వినిపిస్తారని తెలి పారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ హాజరవుతారని వారు పేర్కొన్నారు.

సమాజ సేవతోనే సంతృప్తి: టీజీ వెంకటేశ్



లోగోను ఆవిష్కరిస్తున్న టీజీ వెంకటేశ్, అయత్ కమిటీ సభ్యులు

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సమాజ సేవతోనే సంతృప్తి కలుగుతుందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. నూతనంగా ప్రారంభించిన అయత్ ఫౌండేషన్ సేవా సంస్థ లోగోను గురువారం తన నివాసంలో టీజీ వెంకటేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సమాజాన్ని తన కుటుంబంలా భావించినప్పుడే ప్రగతి ఫలాలు అందుతాయని అన్నారు. పోలీసు శాఖలో విశేష సేవలుందించిన రిటైర్డు డీఎస్పీ మహబూబ్ బాషా సమాజసేవా రంగంలోకి రావడం అభినందనీయమన్నారు. అయత్ ఫౌండేషన్ అధ్యక్షుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ ఒక మంచి సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో తాము ఈ సంస్థను ప్రారంభించామ న్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఆనందరావు, రామ్మోహన్ రెడ్డి, వెంకట్రాముడు, నాగేశ్వరబాబు, సూర్యకుమార్, జ్యోతిరాణి పాల్గొన్నారు.

కాటి కాపరులకు భద్రత కల్పించాలి

సి.బెళగల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాటికాపరులకు భద్రత కల్పించాలని కేవీపీఎస్ నాయకుడు ఆనంద్‌బాబు అన్నారు. మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని ఎన్టీఆర్ పార్కులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాటికాపరులను ప్రభుత్వం నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అనంతరం తహసీల్దార్ పురుషోత్తంకు వినతిపత్రం అందజేశారు. ఈసమావేశంలో కాటికాపరులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతతో ఆరోగ్యానికి రక్ష



సదస్సులో పాల్గొన్న రాయలసీమ బ్రాంచ్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు హాస్పిటల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 70 నుంచి 80 శాతం ప్రజలు దంత సమస్యలతో బాధపడుతున్నారని, నోటి శుభ్రతతో ఆరోగ్యానికి రక్ష అని రాయలసీమ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కిషోర్, డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాయలసీమ డెంటల్ అసోసియేషన్ గురువారం నగరంలోని కేవీఆర్ గార్డెన్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోటి జబ్బులతో దుర్వాసన, చిగుర్లు జబ్బులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి రోజు ఉదయం, రాత్రి బ్రష్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్‌రెడ్డి, రాయలసీమ బ్రాంచ్ జిల్లా జాయింట్ సెక్రటరీ డాక్టర్ నరేష్, డాక్టర్లు నౌషాద్, సతీష్ పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు హాస్పిటల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. నగరంలో గురువారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న రెవెన్యూ భవన్‌లో ఇటీవల మృతి చెందిన ఏబీఎన్ కెమెరామెన్ చిన్నా స్మారకార్థం కర్నూలు మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జర్నలిస్టులు విధి నిర్వహణలో సరైన ఆహారం, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ సిబ్బంది, జర్నలిస్టులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

గూడూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నారాయణ అన్నారు. గురువారం గూడూరు మండలం గుడిపాడు గ్రామంలో ఉపాధి హామీ పనుల దగ్గరికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నారాయణ, సీఐటీయూ మండల కార్యదర్శి జే మోహన్ వెళ్లి కూలీల సమస్యలు తెలుసుకున్నారు.

● గూడూరు పట్టణంలో కాలనీలు కంపుకొడుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీ నారాయణ, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జే మోహన్ అన్నారు. గురువారం గూడూరులో సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు.

ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు: ఎస్టీయూ



మాట్లాడుతున్న గోకారి

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి ప్రభుత్వాన్ని అన్నారు. గురువారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా గోకారి మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ నియా మకం, మధ్యంతర భృతి, పెండింగ్ బకాయిలు, డీఏలు, సరెండర్ బకా యిలు వెంటనే చెల్లించాలన్నారు. పదో తరగతి పరీక్షల విధుల్లో ఉన్న చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్స్, ఇన్విజిలేటర్లను చిన్న చిన్న కారణాలతో సస్పెండ్ చేయడం తగదన్నారు. పది పరీక్షల మూ ల్యాంకనం విధుల నుంచి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి కి మినహాయింపు ఇవ్వాలని, పాఠశాల సహాయకులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. ఏప్రిల్, మే నెలలో జరగ బోయే బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టికే జనార్దన్, మాజీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ షఫీ, ఉపాధ్యాయ కన్వీనర్ దేవదాస్, సీనియర్ నాయకులు ఇస్మాయిల్ సాహెబ్, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించండి: సీపీఎం

ఓర్వకల్లు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పైపులైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, కేతవరం మాజీ సర్పంచ్ రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్లు ఉక్కు పరిశ్రమ కోసం ఆఘమేఘాల మీద పైపులైన్ వేసి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని, అయితే ఆ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఎలాంటి నష్టప రిహారం ఇవ్వలేదన్నారు. డిప్యూటీ సీఎం స్పందించి తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలన్నారు. గతంలో ఫారంపాండ్స్ నిర్మాణాలు చేపట్టారని, అయితే వాటిలో పశువుల పడి చనిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, రైతు సంఘం నాయకులు చంద్రబాబు నాయుడు, మధు, శ్రీధర్, వెంకటేశ్వర్లు, రంగస్వామి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న రమేష్

ఓర్వకల్లు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుద్యోగ యువతకు పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్ కోరారు. గురువారం ఓర్వకల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వాలని కోరారు. 2014లో టీడీపీ ప్రభుత్వం పరిశ్రమల కోసం భూములు తీసుకుందని, భూములు కోల్పోయిన ప్రతి రైతు కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్, రవీంద్ర, రాము నాయక్, హుశేన్ పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్



ముస్లింలకు పండ్లు తినిపిస్తున్న డాక్టర్ నాగేశ్వరయ్య

కర్నూలు కల్చరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గాయత్రీ ఎస్టేట్ సమీపంలోని బిర్లాగడ్డ మసీదులో రోజా (ఉపవాసం) పాటిస్తున్న ముస్లింలకు జీఎన్ఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగేశ్వరయ్య శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరయ్య మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముప్పయ్ రోజులపాటు ఉపవాసం పాటించే ముస్లింలు నియమనిష్టలతో తమ జీవితాన్ని దైవం వైపు మళ్లిస్తారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణ, డ్యూటీ డాక్టర్ నాగేంద్ర, హాస్పిటల్ మెయింటెనెన్స్ ఇన్‌చార్జి కుమార్, మేనేజర్ శివ, ల్యాబ్ టెక్నీషియన్ నరసింహ, పొడిచెర్ల బాషా, తిమ్మప్ప, బాషా, ఖలీల్, ఆరోగ్యమిత్ర అయూబ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలకు ఎంపిక

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక దూపాడు సమీపంలో ఉన్న కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 38 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగళూరు చెందిన కోరో హెల్త్ కేర్ కంపెనీ ఆధ్వర్యంలో చివరి సంవత్సరంలో చదువుతున్న బీఫార్మసీ చదువుతున్న విద్యార్థులు ప్లేస్‌మెంటు డ్రైవ్‌కు 110 మంది విద్యార్థులు హాజరయ్యారు. కంపెనీ నిర్వహించిన రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్ అనంతరం నిర్వహించిన ఇంటర్వ్యూలో 38 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, కరస్పాండెంట్ విజయలక్ష్మమ్మ, ప్రిన్సిపాల్ బీవీ రమణ అభినందించారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ క్లింటన్‌రాజు, ఫౌండర్ ఆపరేషన్ హెడ్స్ జయప్రకాష్, రోహిన్, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి నిజాముద్దీన్, కుసుమ కుమారి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

ఓర్వకల్లు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై అవగా హన అవసరమని జిల్లా ప్రకృతి వ్యవసాయ డీఎల్ఎంపీ లక్ష్మయ్య, ఏవో సుధాకర్ అన్నారు. గురువారం ఓర్వకల్లులోని పొదుపు లక్ష్మి శిక్షణా భవ నంలో వీఏఏ, వీహెచ్ఏ, వెలుగు సీసీలు, వీవోలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో వారు సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మండలంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణ ఎలా చేయాలనే విషయంపై చర్చించారు. మండల సమైఖ్య గౌర వాధ్యక్షురాలు విజయభారతి కార్యక్రమానికి అందించిన సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకట్రామిరెడ్డి, ఎంటీ ఎల్ వంశీకృష్ణ, యశస్విని, లావణ్య కాశీం, రమణ పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మే 15 నుంచి 18 వరకు జరిగే ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జాతీయ కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం సీఆర్ భవన్‌లో మహాసభల లోగోను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మొదటి రోజు దేశం నలుమూలల నంచి వచ్చే వేలాది మంది ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి శ్రీనివాసులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, బీసన్న, అఖిల్, ఖాసిం, కుమార్ పాల్గొన్నారు

ప్రజా సమస్యలను గాలికి వదిలేశారు: సీపీఎం

కర్నూలు న్యూసిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా పని చేయాల్సిన నగర పాలక మండలి సమస్యలను గాలికి వదిలేసిందని సీపీఎం నగర కార్యదర్శివర్గసభ్యుడు డి.అబ్దుల్ దేశాయ్ మండిపడ్డారు. గురువారం సీపీఎం అధ్వర్యంలో 9, 10, 11 వార్డులలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పలు సమస్యలు ఉంటే మేయర్ పీఠం కోసం కార్పొరేటర్లు పోటీ పడుతున్నారని అన్నారు. కనీసం తాగునీరు, చెత్తాచె దారం, కాలువలు శుభ్రం చేయడంపైన అధికారులు, ప్రజాప్రతినిధులు ఏ మాత్రం చిత్తశుద్ధి చూపించడం లేదన్నారు. కార్యక్రమంలో కే.రామకృష్ణ, ఎస్ఎండీ షరీఫ్, జయమ్మ, చాంద్‌బాషా, మాదవ్ పాల్గొన్నారు.

కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నగర శివారు కాలనీల్లో కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. గురువారం ఆయన పెద్దపాడు రోడ్డులోని బోసిరెడ్డి, పోలీసు కాలనీల్లో పర్యటించారు. ఏపీ స్పెషల్ పోలీస్ రెండో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్‌బాషాతో కలిసి కాలనీల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. రహదారులు, మురుగు కాలువలు, తాగునీటి సమస్య పరిష్కరించాలని పోలీసు అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీ, అశోక్‌నగర్ ప్రాంతాలలో పారిశుధ్య పనులను, కలెక్టరేట్‌లోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు.

పాఠశాలను విలీనం చేయొద్దు

కోడుమూరు రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట గిరి ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను మరో పాఠశాలలో విలీ నం చేయొద్దని గురువారం కాలనీవాసులు ఎంఈవో వసంతలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ పాఠశాలలో దాదాపు 35 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. అయినప్పటికీ పక్క కాలనీలోని మరో పాఠశాలకు చేయాలనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇలా చేస్తే విద్యార్థులు నడచి వెళ్లడానికి ఇబ్బంది లు పడతారని తెలిపారు. తమ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాలతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ప్రసాద్, గిడ్డయ్య, దేవరాజు, పౌలు జయరాముడు, దుబ్బన్న, రంగన్న పాల్గొన్నారు.

కర్ణాటక భక్తులకు అన్నదానం



కర్ణాటక భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

గూడూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే కర్ణాటక భక్తులకు దాతలు అన్నదానం చేశారు. గురువారం గూడూరు పట్టణంలో మాజీ జడ్పీటీసీ ఎల్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కర్ణాటక భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా శ్రీశైల పాదయాత్రీకులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో నీలకంఠేశ్వర భక్త బృందం పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు శిక్షణను వినియోగించుకోండి

గూడూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పోషణ్ భీ పఢాయి భీ శిక్షణా కార్యక్రమాన్ని అంగన్‌వాడీలు వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జరీనాబాను అన్నారు. గురువారం గూడూరు ఎంపీడీవో కార్యాల యంలో పోషణ్ భీ పఢాయి భీ శిక్షణ కార్యక్రమం ఐసీడీఎస్ సీడీపీవో వరలక్ష్మీ దేవమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండ లంలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సి.బెళగల్: గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతమ్మ అంగన్‌వాడీలకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసమావేశంలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

బండి నడపాలంటే పరీక్ష

- ఆదోనిలో పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్, కళ్లు మూసుకున్న ట్రాఫిక్ పోలీసులు



మున్సిపల్ మెయిన్ రోడ్డులో అడ్డదిడ్డంగా వాహనాల రాకపోకలు

ఆదోని, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ జనాభా రోజురోజుకు పెరుగుతోంది. అయితే అందుకు తగ్గట్లు రహదారులను విస్తరించలేదు. 30 ఏళ్ల క్రితం ఉన్న రోడ్లే నేటికీ ఉన్నాయి.

విద్యార్థులకు పరీక్ష

ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. అయితే విద్యార్థులకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలంటే ఒక పరీక్షగా మారింది. పట్టణంలోని ప్రధాన రహదారి మున్సిపల్ మెయిన్ రోడ్డులో రోడ్డులపైనే వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీ హోటళ్ల వద్ద రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలను నిలిపేస్తున్నారు. కళ్లెదుటే కనిపిస్తున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

కస్తూర్బాలో ప్రవేశాలు

మద్దికెర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి తెలిపారు. గురువారం మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి గానూ 6, 7, 8 తరగతులతో పాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నేటి నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుపేద విద్యార్థినులు అనాథ బాలలు, బడి మానేసిన బాలికలకు ప్రవేశాల్లో ప్రాధాన్యమిస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో ఇచ్చిన ఫోన్ నెంబర్లు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు.

ఆలూరు కస్తూర్బాలో..

ఆలూరు: పట్టణంలోని కస్తూర్బా విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ మహాసిని గురువారం ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యం ఉంటుందని వచ్చే నెల 11 వరకు అన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఓటర్ల జాబితాపై అవగాహన అవసరం

మద్దికెర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, తొలగింపుపై అవగాహన అవసరమని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ తెలిపారు. వీటికోసం 6, 7, 8 ఫారాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీటీ శ్రీదేవి ఉన్నారు.

23న ఉచిత కంటి వైద్య శిబిరం

పత్తికొండ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 23న విశ్వభారతి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు శ్రీకాంత్ రెడ్డి, కురువ బండయ్య గురువారం తెలిపారు.సాయిబాబా ఆలయంలో కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ రామచంద్రా రెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నామన్నారు.

క్షయను నయం చేయొచ్చు

- ఆదోనిలో నర్సింగ్ విద్యార్థినుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

ఆదోని టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మందులతో క్షయను నయం చేయవచ్చని ఎంపీహెచ్ఎస్ బాబు రాజు అన్నారు. జాతీయ క్షయ నివారణలో భాగంగా గురువారం నేషనల్ నర్సింగ్ స్కూల్ విద్యార్థినులచే ర్యాలీ నిర్వహించారు. క్షయను ప్రారంభ దశలో గుర్తించి సకాలంలో, సరైన మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందని, కేంద్ర ప్రభుత్వం క్షయ నిర్మూలనకు ఉచితంగా మందులను అందిస్తోందన్నారు. సిబ్బంది సుబ్బమ్మ బాయి, లలితమ్మ, భాస్కర్, వీరేష్, ప్రిన్సిపాల్ నిలోఫర్ పాల్గొన్నారు.

వైద్య కళాశాల పనులను నిలిపివేయడం దుర్మార్గం

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్ బాషా



కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులను నిలిపివేయడం దుర్మార్గమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మెడికల్ కళాశాల భవనాల వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు ఆందోళన చేశారు. పశ్చిమ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని గత ప్రభుత్వం రూ.470కోట్లతో వైద్య కళాశాల నిర్మాణాన్ని ప్రారంభించిందన్నారు. ఇప్పటికే 60శాతం పైగా పనులు పూర్తయ్యాయని, అయితే కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వైద్య కళాశాల పనులను నిలిపివేసిందని ఆరోపించారు. ప్రజలకు మేలు చేసే పనిపై ఇలా కక్షపూరితంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. దీనిపై ఎమ్మెల్యే అసెంబ్లీలో ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సోమన్న, రంగస్వామి, శరత్ కుమార్, దస్తగిరి వీరేష్ పట్టణ అధ్యక్షులు లింగప్ప, శేఖర్, శివ, మోహన్, రవి, వినయ్ పాల్గొన్నారు.

వైద్యాధికారుల తనిఖీలు

హాలహర్వి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూళ్యం గ్రామంలో ఆర్ఎంపీల క్లినిక్‌లను డిప్యూటీ డీఎంహెచ్‌వో రఘురాం రెడ్డి, వైద్యాధికారి మన్సూర్ గురువారం తనిఖీ చేశారు. సమాచారం తెలుసుకున్న ఆర్ఎంపీ వైద్యులు ముందుగానే క్లినిక్‌లకు తాళాలు వేసి పరారయ్యారు. అనుమతి లేకుండా వైద్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులు తెలిపారు. మెడికల్ షాపులు వారికి, ఆర్ఎంపీలకు నోటీసులు జారీ చేశారు.



మెడికల్ షాపుల వారికి నోటీసులు జారీ చేస్తున్న అధికారులు

టీబీ డ్యాంకు కొత్తగేట్లు ఏర్పాటు చేయాలి

ఆలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాంకు కొత్త గేట్లు ఏర్పాటు చేయాలని ఎల్ఎల్‌సీ డిస్ట్రిబ్యూటరీ మాజీ అధ్యక్షుడు తప్పెట రామిరెడ్డి సూచించారు. గురువారం టీబీ డ్యాం షటర్లను ఆయన పరిశీలించారు. గత ఆగస్టులో కొట్టుకుపోయిన 19వ గేటును దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్త చర్యగా క్రొత్త గేట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని గేట్లను మార్చాలని నిపుణుల కమిటీ సూచించిందన్నారు. మార్చిలో పనులు చేపట్టి, మే నాటికి పూర్తి చేసేలా టెండర్లు పిలవాలని బోర్డు అధికార్లను కోరారు. కర్ణాటక రైతులు లిఫ్టులతో నీటిని మళ్లించుకుంటున్నారన్నారు.



డ్యాంను పరిశీలిస్తున్న రామిరెడ్డి

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



సర్పంచులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ

హొళగుంద, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఆలూరు డీఈ మల్లికార్జునయ్య సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నీటి ఎద్దడిపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. చిన్నహ్యాట, ఎల్లార్తి గ్రామాలకు నూతన పైప్‌లైన్ వేయడంతో పాటు, నేరణికి గ్రామం లో ఆర్‌వో ప్లాంటు, గజ్జెహళ్లి గ్రామానికి కడ్లమాగి సీపీడబ్ల్యూ స్కీమ్ నుంచి నీటి సరఫరా, కోగిలతోట గ్రామానికి ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటయ్యేలా జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళామన్నారు. ఎంపీడీవో విజయ లలితా, ఏఈలు రాంనీలా, వెంకటరమణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయాల భూములను రక్షించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి



ఆదోని, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం హిందూ ఆలయాల భూములను రక్షించాలని ఎమ్మెల్యే పార్థసారథి కోరారు. గురువారం అసెంబ్లీ హాలులో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.10లక్షల ఎకరాల భూములుంటే అందులో 1,10లక్షల ఎకరాలు అక్రమించుకున్నారన్నారు. జీవో నెం.11/2015 ప్రకారం ఆలయ భూములు ప్రభుత్వానివి కాదన్నారు. భూములు ఆక్రమణలకు గురవుతుంటే ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామన్నారు.

కూటమి రోడ్డు వేస్తే ఎమ్మెల్యే ఫొటోలా?

ఆలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిలిచిపోయిన జాతీయ రహదారిని కూటమి ప్రభుత్వం నిర్మిస్తే ఎమ్మెల్యే విరుపాక్షి తానే నిర్మించినట్లు ఫొటోలకు ఫోజులు ఇవ్వడం హాస్యస్పదంగా ఉందని తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి సురేంద్ర అన్నారు. గురువా రం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ రహదారి పనులు నిర్మాణం పనులు నిలిచిపోతే ఎంపీ బస్తిపాటి నాగరాజు, గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజినేయులు, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కృషితో రహదారి పూర్తయిందన్నారు. ఎమ్మెల్యే విరుపాక్షి తన గ్రాంట్స్‌తో అభివృద్ధి చేసి అప్పుడు ఫొటోలకు ఫోజులు ఇవ్వాలని సూచించారు. మాజీ సర్పంచ్ వెంకటేష్, శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలుగు యువత అధికార ప్రతినిధి బోయ సురేంద్ర

ముగిసిన బ్రహ్మోత్సవాలు

మద్దికెర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పెరవలి గ్రామం రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను తీసుకెళ్లి బావి వద్ద వసంతోత్సవానికి ఏర్పాటు చేశారు. అక్కడ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు రంగులు చల్లుకుంటూ, బాణాలు కాల్చారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో విగ్రహాలను ఊరేగించారు. ఆలయ ఈవో వీరయ్య ఉన్నారు. నేడు హుండీ లెక్కిస్తామని ఈవో తెలిపారు. పాల్గొనదలచే భక్తులు సాంప్రదాయ దుస్తుల్లో రావాలని కోరారు.

గద్దెరాళ్ల హుండీ లెక్కింపు



ప్రాంగణంలో లెక్కిస్తున్న సిబ్బంది

దేవనకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గద్దెరాళ్ల దేవర గురువారంతో ముగియడంతో ఆలయ ప్రాంగణంలో హుండీని లెక్కించారు. ఆదాయం రూ. 13.85 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. శాశ్వత హుండీ రూ.4.11 లక్షలు, తాత్కాలిక హుండీ రూ.7.74 లక్షలు వచ్చాయన్నారు.

నేటి నుంచి అన్నదానం

ఆదోని టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉగాదికి శ్రీశైలానికి వెళ్లే పాదయాత్ర భక్తులకు నేటి నుంచి అన్నదానం చేయనున్నట్లు అల్వార్ మఠం మహర్షి విజయ్ కుమార్ గురువారం తెలిపారు. 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పట్టణ శివార్లలోని సరస్వతి దేవి ఆలయంలో ఉంటుందన్నారు.

23న మండల సమావేశం

దేవనకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 23న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ తెలిపారు. అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా ఆదివారం నిర్వహిస్తున్నామని సభ్యులు తప్పక హాజరు కావాలని సూచించారు.

కూలీల హాజరు పెంచాలి

ఆలూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి కూలీల హాజరు శాతం పెంచాలని ఆలూరు ఏపీడీ పద్మావతి అన్నారు. ములగవల్లి గ్రామంలో నీటి కుంటలను ఏపీడీ పరిశీలించారు. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొలతలు రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. ఈసీ మారన్న, టెక్నికల్ అసిస్టెంట్లు ఈరన్న, నాగేష్ ఉన్నారు.

వేలం పాటలు వాయిదా

వెల్దుర్తి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి పంచాయతీ వేలం పాటలు వాయిదా వస్తున్నట్లు కార్యదర్శి లక్ష్మీనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో వేలాలు నిర్వహించాల్సి ఉండగా, 22న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో 25వ తేదీ మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

27న ఉప సర్పంచ్ ఎన్నిక

దేవనకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలమకూరు ఉప సర్పంచ్ ఎన్నిక 27న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ తెలిపారు. ఉప సర్పంచ్‌గా ఉన్న గొల్ల సుజాత రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడిందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిందని, పంచాయతీలో 10 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు.

22న క్రికెట్ టోర్నమెంట్

తుగ్గలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఈనెల 22,23న క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు సీపీఐ కార్యవర్గ సభ్యులు నబీరసూల్, ఏఐవైఎఫ్ హనుమేష్ గురువారం తెలిపారు. రామలింగాయపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో టోర్నమెంట్ ఉంటుందని విజేతకు రూ.10వేలు, రన్నర్స్‌కు రూ.6వేలు అందిస్తామన్నారు. రూ.500లు నిర్వాహకుడు షేక్షావలికి చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 7382202922 నెంబర్లో సంప్రదించాలన్నారు.

నిధులు ఇవ్వండి

తుగ్గలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని టీడీపీ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి కోరారు. గురువారం మండల కేంద్రమైన తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విశ్వమోహన్‌ను నిధులు మంజూరు చేయాలని కోరారు. తండాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలన్నారు.

ముగిసిన చర్చావేదిక

- రూ.4 లక్షల రికవరీ.. రూ.3.50 లక్షల జరిమానా



వివరాలను పరిశీలిస్తు మాధవీలత

తుగ్గలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 2023-24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల 18వ సోషల్ ఆడిట్ చర్చావేదిక గురువారం ముగిసింది. రెండు పంచాయతీలు తప్ప మిగిలిన అన్ని పంచాయతీల్లో రికవరీలు, జరిమానా విధించారు. అడిషనల్ పీడీ మాధవీలత సమక్షంలలో ఏడు గ్రామ పంచాయతీల వివరాలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. సూర్యతండా, ఎల్లమ్మగుట్ట తండా పంచాయితీల పరిధిలో మాత్రం రికవరీ, జరిమానా విధించలేదు. మీటె తండాకు కేవలం రూ.వెయ్యి మాత్రమే జరిమానా విధించగా మిగిలిన 20 గ్రామ పంచాయతీల పరిధిలో రికవరీలు రూ.4,10,189, పెనాల్టీలు 3,51,500 ఏపీడీ విధించారు. సంబంధిత వ్యక్తులు రికవరీ, జరిమానా చెల్లించని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వమోహన్, ఏపీడీ ఫక్కీరప్ప, ఏపీవోలు హేమసుందర్, రామకృష్ణ, ఈసీ ప్రదీప్ కుమార్, టీఏలు ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్

మద్దికెర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం ఉంటుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించి, పోస్టర్లను విడుదల చేశారు. సాగుకు అవసరమయ్యే కషాయాలు, ద్రావణాలను అందుబాటులో ఉంచాలన్నారు. మండలంలో హంపా, ఎం.అగ్రహారం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేస్తున్నామని తెలిపారు. ఏపీఎం రామాంజనేయులు, ఏవో రవి, సీసీ రాజన్న, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుధాకర్, రంగస్వామి, భీమరాజు, మునిరాజు, అనంతరాజు, బిస్మిలా తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై సమావేశం

చిప్పగిరి: వెలుగు కార్యాలంలో ఏవో జయలక్ష్మి, వెలుగు ఏపీఎం నాగార్జున, ప్రకృతి వ్యవసాయ ఎంటి రేవన్న ప్రకృతి వ్యవసాయంపై గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి రైతు సాధికార ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఖరీఫ్ 2025-26 ప్రణాళికలు చేసుకోవాలన్నారు. జీనామృతం చల్లిన భూమిలో వానపాములు చైతన్యవంతమై పంటలకు పోషకాలు అందుతాయన్నారు.

అభివృద్ధికి సహకరించండి

ఆలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడు మిక్కిలినేని శివప్రసాద్ కోరారు. గురువారం రాష్ట్ర ఎక్సైజ్, మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రనాథ్ విజయవాడలో కలిశారు. కర్ణాటక మద్యం సరఫరాకు అడ్డుకట్ట వేయాలని, అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.



మంత్రి కొల్లు రవీంద్రతో వీరభద్ర గౌడ్

కాలును పొడిగించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య



మాట్లాడుతున్న గిడ్డయ్య

పత్తికొండ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పందికోన రిజర్వాయర్ కింద ఎడమ కాలువను పొడిగించి సాగు, తాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. గురువారం సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ పత్తికొండ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు హంద్రీనీవా జలాలతో పందికోన రిజర్వాయర్‌ను నింపి కుడి, ఎడమ కాలువల ద్వారా 60వేల ఎకరాలకు నీరందించేందుకు రూపకల్పన చేశారన్నారు. అయితే ఎడమ కాలువ ద్వారా దేవనకొండకు సాగు నీరు అందుతోందని, దీన్ని పత్తికొండ మండలం హోసూరు, పెద్దహుల్తి వదరకు విస్తరించాలని కోరారు. ఈ విషయంలో ఈ నెల 21 నుంచి 27 వరకు గ్రామాల్లో ప్రజల సంతకాల సేకరణ, 28న గ్రామ సచివాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. రాజాసాహె బ్, రామాంజనేయులు, రైతుసంఘం అధ్యక్ష కార్యదర్శులు ఉమాపతి, సురేంద్రకుమార్, గౌరవాధ్యక్షుడు కారన్న పాల్గొన్నారు.

వేసవిలో పిల్లల పట్ల జాగ్రత్త తీసుకోవాలి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పిల్లల వైద్యుడు రామకృష్ణ



ఆలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఎండకాలంలో చిన్న పిల్లల పట్ల జాగ్రత్తచ వహించాలని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రి చిన్న పిల్లల వైద్యుడు రామకృష్ణ సూచించారు.

ప్రశ్న: ఎండల నుంచి పిల్లలను ఎలా రక్షించుకోవాలి?

జవాబు: చిన్న పిల్లలకు ద్రవపదార్థాలు అధికంగా ఇవ్వాలి. ఓఆర్ఎస్, నిమ్మరసం, మజ్జిగ తాగించాలి.

ప్రశ్న: ఎండల వల్ల పిల్లల్లో ఎలాంటి వ్యాధులు వస్తాయి?

జవాబు: డయేరియా వచ్చే అవకాశాలు ఎక్కువగాఉన్నాయి. తాజా పండ్లు బాగా తినిపించాలి. జంక్ ఫుడ్స్, బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉంచాలి. చికెన్ పాక్స్ సోకితే నాటు వైద్యం చేయించకుండా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

ప్రశ్న: పదో తరగతి విద్యార్థులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: పదో తరగతి విద్యార్థులు అందోళన చెందకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలి. రాత్రి ఎక్కువసేపు నిద్ర మేలుకోకుండా త్వరగా నిద్రపోవాలి. తెల్లవారు జామున లేచి కొద్దిసేపు వ్యాయామం చేసి చదువుకోవాలి. డైటింగ్ చేయకుండా టిఫిన్ చేసిన తర్వాతే పరీక్షలకు హాజరు కావాలి. నీళ్లు అధికంగా తీసుకోవాలి.

ప్రశ్న: వడదెబ్బ తగలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: సాధ్యమైనంత వరకు ఎండకు బయటకు వెళ్లకుండా చూసుకోవాలి. అవసరమైతే తెల్లటి కాటన్ దుస్తులు ధరించి, గొడుగుతో బయటకు వెళ్లాలి. ద్విచక్ర వాహనాలపై దూర ప్రాంతాలకు ఎండలో వెళ్లకూడదు.

ఆటో బోల్తా .. గాయాలు

ఆలూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కురవళ్లి- హాలహర్వి మధ్య ఆటో బోల్తాపడి ఆరుగురికి గాయాలు అయ్యాయి. వివరాల మేరకు.. గురువారం ఆగ్రహారం నుంచి కూలీలు మిరప తెచ్చేందుకు ఆటోలో బయలు దేరారు. అయితే ఆటో బోల్తా పడడంతో కూలీలు ఐశ్వర్య విజయలక్ష్మి, రాధమ్మ, లింగమ్మ తదితరులు గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

22న జాబ్ మేళా

ఆలూరు రూరల్, మార్చి 20 (ఆధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 22న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ ప్రిన్సిపాల్ రమాదేవి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివి 18-35 సంవత్సరాల లోపు కలిగిన అభ్యర్థులు అర్హులు అని చెప్పారు వివరాలకు 9010003132 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఆస్పరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆస్పరితో పాటు గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని రైతు సంఘం అధ్యక్షుడు నాగేంద్రయ్య, మండల కార్యదర్శి విరుపాక్షి డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ ఆస్పరితోపాటు శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, అలిగేరా, చిగలీ, నగరూరు గ్రామాలకు నాగనాతనహళ్లి ఎస్ఎస్ ట్యాంకును నిర్మించారన్నారు. అయితే ఈ గ్రామాలకు నీళ్లు ఆదోని మీదుగా వస్తుండడంతో అక్రమ కలెక్షన్లతో వాడుకోవడంతో మండలానికి నీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ హనుమేష్‌కు వినతిపత్రం ఇచ్చారు.

మంత్రాలయంలో భక్తుల రద్దీ



మఠం ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది. గురువారం రాఘవేంద్ర స్వామికి ఇష్టమైన దినం కావటంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, మధ్వమార్గ్ కారిడార్, రాఘవేంద్ర సర్కిల్, నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని భక్తులు మఠం పీఠాధిపతి ఆశీస్సులు పొందారు.

వైభవంగా నవరత్నాల రథోత్సవం: రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు నవరత్నాల రథంపై విహరించారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవ్రేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి పూర్ణ భోధ పూజ మందిరంలో మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛారణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథంపై ఊరేగించారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదుపై ఆయా రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ శేషఫణి గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా ఓటరు నమోదు చేసుకునే వారికి ప్రస్తుతం అవకాశం ఉందని తెలిపారు. ఓటరు జాబితాను ప్రతి రాజకీయ పార్టీలు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. ఎక్కడైనా తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటరు నమోదును ఎన్నికల ఈసీ జాగ్రత్తగా పర్యవేక్షిస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ నరసప్ప, వైసీపీ నాయకులు శివప్రసాద్, కేశన్న, విరుపాక్షిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు వీరేష్‌యాదవ్, సీపీఎం నాయకులు గోవిందు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

డంపు యార్డులో మంటలు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణ సమీపంలోని సోగనూరు రోడ్డులో ఉన్న డంపుయార్డులో గురువారం మధ్యాహ్నం మంటలు చలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. డంపుయార్డులో ప్రమాదవశాత్తు వ్యాపించిన మంటలను సకాలంలో ఆర్పివేయడంతో చుట్టుపక్కల ఉన్న పొలాలకు ఎలాంటి ప్రమాదం జరగలేదని అగ్నిమాపక అధికారి రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ చిన్నరాముడు, ఈసీ చిన్న ఈరన్న, కబ్బుల్ బాషా లు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

నందవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శైలజ గురువారం తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, పదవతరగతికి 3, ఇంటర్మీడియట్ మొదటి ఏడాదికి 40 సీట్లు, ఇంటర్ రెండో ఏడాదికి 21 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు ఆసక్తి గల విద్యార్థులు 22వ తేదీ నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు ఎప్రిల్ 11న చివరి తేదీ అన్నారు. ఇందులో తల్లిదండ్రులు లేని, అనాథ, డ్రాపౌట్ పిల్లలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు..

టీడీపీ నాయకుడి మృతి పార్టీకి తీరని లోటు

నందవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని హలహర్వి గ్రామంలో టీడీపీ నాయకుడు అద్దాల కర్రెన్న(75) మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎంపీపీ తనయుడు రైస్ మిల్ నారాయనరెడ్డి అన్నారు. గురువారం ఆయన భౌతికకాయానికి నివాళి అర్పించారు. కర్రెన్న కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమం డీసీ మెంబర్ ఎర్రం నాయుడు, రాఘప్ప, ప్రభుదాసు, బోడిస్వామి, గొల్లరవి, ఏసుపు, ఆంద్రయ్య పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రానికి కొత్త బెంచీలు



పది పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన కొత్త బెంచీలను పరిశీలిస్తున్న ఎంఈవో శోభారాణి

కోసిగి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని బాలుర, బాలికల పరీక్షా కేంద్రాల్లో బెంచీలు రంధ్రాలు పడి అసంపూర్తిగా ఉన్నాయని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేయడంతో గురువారం మండల విద్యాధికారి శోభారాణి, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగేశ్వరి దేవి విరిగిన, రంధ్రాలు పడ్డ బెంచీలను మార్చి కొత్త బెంచీలను ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎంఈవో శోభారాణి తెలిపారు.

వ్యాపారులకు దుకాణాలు కేటాయించాలి



గ్రామ కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

మంత్రాలయం, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : మంత్రాలయంలో కూరగాయల వ్యాపారస్థులకు దుకాణాలు నిర్మించి ఇవ్వాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు చిన్న, మండల కార్యదర్శి ఎం.రాజు కోరారు. గురువారం మంత్రాలయంలో సంత మార్కెట్‌లో కూరగాయల వ్యాపారస్తులకు దుకాణాలు లేక రోడ్లపైనే మార్కెట్ వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. వెంటనే వారికి నూతనంగా దుకాణాలు కట్టించి ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఎస్.రవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మోహన్, ఫణీంద్ర, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాలు

పేద విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరాయి. దాదాపు ఏడేళ్ల క్రితం వరకు ఎంతో మంది పేద విద్యార్థులకు ఆశ్రయమిచ్చిన పక్కాభవనాలు నిర్వహణ లేకపోవడంతో ఒక్కొక్కటిగా శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.. దీంతో వసతి గృహం అధికారులు చేసేదిలేక హాస్టళ్లను అద్దెభవనాల్లోకి మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వసతి గృహాలన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. శిథిలమైన భవనాలను గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ ప్రభుత్వమైన భవనాలకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.



ఇంద్రానగర్‌లో శిథిలావస్థలో బాలికల వసతి భవనం

- శిథిలావస్థలో సంక్షేమ హాస్టళ్ల భవనాలు
- అద్దె భవనాల్లో విద్యార్థుల అవస్థలు
- రూ. కోట్ల విలువైన హాస్టళ్ల స్థలాలు
- గతంలో లీజుపేరుతో స్వాధీనానికి ఎత్తులు
- అన్యాక్రాంతం కాకుండా భవనాలు నిర్మించాలి

ఎమ్మిగనూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో 1990లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, బీసీ, అనాథ బాలుర హాస్టళ్లకు స్థలాలు కేటాయించి భవనాలు నిర్మించారు. అలాగే పట్టణంలో మరో చోట ఇంద్రానగర్‌లో జడ్పీ బాలికల పాఠశాల వెనుక బాలికల ఎస్సీ హాస్టల్‌కు భవనం నిర్మించారు. ఈ భవనాల్లో గత ఏడేళ్ల క్రితం వరకు నడిచాయి. అయితే భవనాలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో గదుల పెచ్చులూడిపోవటం, వాకిళ్లు, కిటికీలు విరిగిపోవటం, బండలు లేచిపోవటంతో పాటు మరుగుదొడ్లు, స్నానపు గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాలకు సకాలంలో మరమ్మతులు చేసిఉంటే నేటికీ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడేవి. నేడు అవి బూతుబంగ్లాలుగా మారాయి. హాస్టళ్లలో ముళ్ల చెట్లు ఏపుగా పెరిగిపోయాయి.

● అద్దెభవనాల్లో వసతులు అంతంత మాత్రమే

పట్టణంలో కొనసాగుతున్న బీసీ బాలుర, బీసీ బాలికల హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అద్దెభవనాలు కావటంతో ఉన్నవాటిలోనే సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీసీ ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ హాస్టళ్లు పట్టణంలోని గుడికల్ రోడ్డులో రెండు కాంప్లెక్స్‌లో కొనసాగుతున్నాయి. ఈ రెండు హాస్టళ్లలో దాదాపు 180మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. అవసరమైన గదులు ఉన్నప్పటికి మరుగుదొడ్లు, స్నానపు గదులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అలాగే పట్టణంలో గీతానగర్‌లో ఉన్న రెండు బాలికల వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అలాగే గోనెగండ్ల రోడ్డు, సున్నంబట్టి మసీదు ప్రాంతంలో ఉన్న రెండు బీసీ మహిళల, బీసీ బాలుర వసతి గృహాలు ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా బాలబాలికలు ఈ అద్దెభవనాల్లో ఉండటం వల్ల చదువును ప్రశాంతంగా కొనసాగే పరిస్థితి కనిపించటం లేదు. కోట్ల విలువ చేసే స్థలాలు అన్యాక్రాంతం కాకుండా భవనాలు నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

● ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే:

ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న సాంఘిసంక్షేమ హాస్టళ్ల భవనాలు శిథిలావస్థకు చేరాన్ని స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ఇటీవలే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్థలాలు ఉన్నా సొంతభవనాలు లేక విద్యార్థులు పడుతున్న అవస్థలను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొత్త భవనాలు నిర్మిచేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి ఆదేశాల మేరకు నివేదికలను పంపేందుకు సంబంధిత ఉన్నతాధికారులు సిద్ధం చేస్తున్నారు.



పూర్తిగా ధ్వంసమైన బీసీ హాస్టల్ భవనం



గుడికల్ రోడ్డులో అద్దెభవనంలో కొనసాగుతున్న బీసీ హాస్టల్

ముగిసిన సుయతీంద్రతీర్థుల ఆరాధనోత్సవాలు

మంత్రాలయం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠం పూర్వ పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల 12వ ఆరాధనోత్సవాలు గురువారం ఘనంగా ముగిసాయి. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో తన గురువైన సుయతీంద్రతీర్థుల మూల బృంధావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి తులసి అర్చన చేసి బంగారు, వెండి, పట్టువస్త్రాలు, గులాబి పుష్పాలతో అలంకరించి మహా మంగళహారతులు ఇచ్చారు. యాగశాలలో నిర్వహించిన ప్రవచనాలు, దాసవాని సాహిత్యం భక్తులను ఆకట్టుకున్నాయి. పూర్ణబోధ పూజామందిరంలో మూలరాములకు కనకాభిషేకం చేసి రాఘవేంద్రస్వామి బంగారు పాదుకలకు పూజలు, పుష్పాలతో అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో పండితకేసరి రాజా ఎస్ గిరిరాజాచార్, ఎస్ఎన్ వెంకటేశాచార్, ఎస్ఎన్ రఘునందన్ ఆచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోసీ, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, అనంతపురాణిక్, కర్నూలు జేఈవో పాండురంగారెడ్డి, డీఎం ఆనందరావు, జేసీ స్వామి, వాదీంద్రాచార్,, వ్యాసరాజాచార్, వాధిరాజాచార్ పాల్గొన్నారు.

● అలరించిన దాసవాని సాహిత్యం: ఉత్సవాల ముగింపులో భాగంగా బెంగళూరు చెందిన విద్వాన్ శ్రీనిధిఆచార్‌చే నిర్వహించిన దాసవాని సాహిత్యం భక్తులను ఆకట్టుకుంది. బెంగళూరు చెందిన విద్వాన్ బ్రాహ్మణాచార్, ఉత్తనూరు చెందిన శ్రీనిధి ఆచార్‌చే ప్రవచనాలు భక్తులను అలరించాయి. వీరికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, నగదు, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.



మూలరాములకు పూజలు చేస్తున్న పీఠాధిపతి

సుయతీంద్ర-2025 అవార్డుల ప్రదానం



కృష్ణమూర్తికి అవార్డు అందజేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పూర్వ పీఠాధిపతి సుయతీంద్ర తీర్థుల ఉత్సవాల్లో ఆఖరి రోజు ఉత్తరాధనను పురస్కరించుకుని గురువారం రాత్రి యాగశాలలో ప్రముఖులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు సుయతీం ద్రుల-2025 అవార్డులను ప్రదానం చేశారు. శ్రీమఠం ఆడిట్ అధికారి కృష్ణమూర్తి, గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల ప్రిన్సిపాల్ జీవీ రమణరావు, సుజయీంద్ర ఆరోగ్యశాలలో పని చేస్తున్న సరళ, ఈరమ్మ, రాధ, కోటిసేతు మాధవరావు, ముద్దు రంగారావు, గండేరు పవన్ కుమార్, మురళిధర్ కులకర్ణిలకు ప్రశంసా పత్రం, మెమెంటో, వెండి ప్లేటు, శేష వస్త్రం, నగదు, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి సత్కరించారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి

గోనెగండ్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ తాలుకా ముస్లిం మైనార్టీ నాయకులు నూరహమ్మద్, డాక్టర్ మిన్నల్ల, మదీనా, కొత్తింటి ఫక్రుద్దీన్ అన్నారు. గురువారం మండల కేంద్రమన గోనెగండ్లలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తున్నాయని అన్నారు. అలాగే గోనెగండ్ల మండలంలోని పలు గ్రామాలలో దాదాపు రూ. 3కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజి పనులు చేపట్టడం జరిగిందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు గాను జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో మట్టి రోడ్డు లేకుండా సీసీ రోడ్డులను ఏర్పాటు చేయడమే టీడీపీ ధ్యేయం అని అన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

మంత్రాలయం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి)ః డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని బహుజనులంతా సమష్టిగా నిర్వహిద్దామని జైభీమ్ ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కేం జానయ్య, జిల్లాకార్యదర్శి రత్నం అన్నారు. గురువారం మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో అంబేద్కర్ జయంతి కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులంతా ఐక్యంగా అంబేద్కర్ జయంతిని నిర్వహించేందుకు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు హనుమంతప్ప, నరసింహులు, రవి,దానియేలు, యేసు, దేవరాజు, లాజరు,పెద్ద భీమయ్య, ప్రభుదాసు, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేటు వద్ద అవస్థలు

- వేసవిలో ఎండకు తాళలేక ఇబ్బందులు
- చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని వాహనదారుల విన్నపం



రైల్వే గేటు పడటంతో మండుటెండలో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

కోసిగి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కోసిగి రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. కోసిగిలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని అనేక సార్లు రైల్వే అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం 11 గంటలకే ఎండలు భగభగ మండుతున్నాయి. కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో రైల్వేగేటు పడితే చాలు గంటల తరబడి ప్రజలు ఎండలోనే ఉండాల్సి పరిస్థితి ఏర్పడుతోంది. గేటు వద్ద చలువ పందిళ్లు లేకపోవడంతో వాహనదారులు అల్లాడుతున్నారు. చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు అయితే నానా అవస్థలు పడుతున్నారు. సంబంధిత రైల్వే శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు రైల్వే గేటు రెండు వైపులా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నిందితుల అరెస్టు

మంత్రాలయం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని గుల్బర్గాలో జరిగిన హత్య కేసులో నిందితులు మంత్రాలయంలో తలదాచుకుని పోలీసులకు పట్టుబడ్డారు. ఈ నెల 16న రాత్రి ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి రేవన సిద్దప్ప (33) అనే వ్యక్తిని హత్య చేసి నిందితులు పరారై మంత్రాలయంలో ఓ ప్రైవేటు లాడ్జిలో తలదాచుకున్నారు. గుల్బర్గా సీఐ సునీల్ కుమార్ నిందితులు మంత్రాలయంలో ఉన్నారని తెలుసుకొని ఇక్కడి వచ్చారు. మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్‌తో కలిసి గురువారం ముగ్గురు నిందితులను లాడ్జిలో అరెస్టు చేశారు.

పురందేశ్వరి పర్యటన వాయిదా

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం పర్యటన వాయిదా పడింది. ఈ సందర్భంగా గురువారం ఎమ్మిగనూరు బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ తోగట నరసింహులు మాట్లాడుతూ 22న ఆలూరులో జరిగే బహిరంగ సభకు హాజరు కావాలని, అనివార్యకారణాల వల్ల పర్యటన రద్దు అయిందన్నారు. ఎమ్మిగనూరులో 22న విశాలగార్డెన్‌లో జరిగే బీజేపీ కార్యకర్తల సమావేశానికి కేంద్ర మంత్రి ఎం.మధుకర్ హాజరవుతున్నారని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

అయ్యకొండలో డెంగీ కేసు నమోదు

రెండు నెలల్లో 11 కేసులు నమోదు

గోనెగండ్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలంలో డెంగీ విజృంభిస్తోంది. గురువారం అయ్యకొండ గ్రామంలో ఎనిమిదేళ్ల బాలికకు డెంగీ వ్యాధి సోకిందని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్ తెలిపారు. అయ్యకొండ గ్రామంలో ఆయన, వైద్యశాఖ సిబ్బంది, ఎంపీడీవో మణిమంజరి పర్యటించారు. అధికారులు మురికివాడలలో పర్యటించి అక్కడి వారికి ఆరోగ్యసూత్రలను వివరించారు. నిలువ ఉన్న నీటిని పరిశీలించారు. వీధుల్లో ఉన్న మురుగునీటి ని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. రోగులకు జ్వరం, దగ్గు, జలుబు, ఇతర వ్యాధులు ఉన్నవారికి ఉచితంగా మందులను అందజేశారు. వారు మాట్లాడుతూ దోమలు పెరగడం ద్వారా మలేరియ, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు ప్రబలుతాయన్నారు. గత రెండు మాసాలలో మండలంలోని హెచ్కైరవాడి, చిన్నమరివీడు, వేముగోడు, కులుమాల, పెద్దమరివీడు, గంజహళ్లి, అయ్యకొండ గ్రామాలలో పదకొండు డెంగీ కేసులు నమోదయ్యాయి. నీరు నిలువ ఉన్న చోట ఆయిల్‌బాయిల్, ఎంఎల్‌ఆయిల్ స్ప్రేయింగ్ చేయించారు. డెంగీ వ్యాధి సోకిన వారి ఇండ్లలో దోమలు ప్రబలకుండా మందును పిచికారి చేయాలన్నారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం ఉన్నట్లు తెలిస్తే వెంటనే గోనెగండ్ల ప్రభుత్వ అసుపత్రికి రావాలిని వైద్యసిబ్బంది గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మణిమంజరి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, హనుమంతు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, వైద్యఆరోగ్యసిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి



ఈకేవైసీ కోసం బారులు తీరిన ప్రజలు

కోసిగి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులో ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులు రేషన్ డీలర్ల దగ్గర ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ రుద్ర గౌడు తెలిపారు. చిన్న పిల్లలకు, పెద్దలకు ఆధార్ వేలిముద్రలు పడనివారు.. ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్ కానీ వారు పెద్ద ఎత్తున గురువారం కోసిగిలోని సచివాలయం-4 వద్దకు తరలివచ్చారు. మండలంలో ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న వారు 12,039 మంది ఉన్నారని తహసీల్దారు తెలిపారు. ఈకేవైసీ లబ్ధిదారులు బయోమెట్రిక్ వేసి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు.